మద్యం తయారీలో బ్రాందీకి ఒక ఫార్ములా ఉంటుంది. విస్కీకి మరో ఫార్ములా ఉంటుంది. రమ్ముకు ఇంకో ఫార్ములా ఉంటుంది. ప్రభుత్వ అనుమతితో నిర్వహించే ప్రతి డిస్టిలరీలో తయారయ్యే మద్యానికి ఈ సూత్రం వర్తిస్తుంది. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలోని ములకలచెరువులో, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో తయారైన నకిలీ మద్యానికి మాత్రం బాలాజీ ఫార్ములాను ఉపయోగించాడు నకిలీ మద్యం కేసులో సూత్రధారి అద్దేపల్లి జనార్దనరావు.

కిక్కు ఎక్కేలా.. ఫార్ములా



సరికొత్తగా నకిలీ మద్యం తయారీ

నిందితుడు జనార్దనరావుకు సహకరించిన కొత్త ఫ్రెండ్

- చిత్తూరు జిల్లాకు చెందిన బాలాజీతో గోవాలో బంధం
- బెంగళూరు డిస్టిలరీల్లో పనిచేసిన అనుభవం
- మద్యం తయారీ ఫార్ములా చెప్పాలన్న జనార్దనరావు
- నిరాకరించిన బాలాజీ.. తానే చేసి ఇస్తానని హామీ
- ములకలచెరువు, ఇబ్రహీంపట్నంలో మద్యం తయారుచేసింది అతనే..
- అడ్వాన్స్‌గా రూ.20 లక్షలు చెల్లింపు.. అమ్మకాల్లో కమీషన్
- నకిలీ వ్యవహారం బయటపడటంతో అజ్ఞాతంలోకి..

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : నకిలీ మద్యం తయారీ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అద్దేపల్లి జనార్దనరావు సొంతంగానే మద్యం తయారు చేయాలని భావించాడు. ఇందుకోసం చిత్తూరు జిల్లాకు చెందిన బాలాజీ వద్ద ఉన్న ఫార్ములా చెప్పాలని కోరాడు. దీనికి బాలాజీ ససేమిరా అనడంతో జనార్దనరావుకు మరో మార్గం కనిపించలేదు. బాలాజీ బెంగళూరులోని పలు డిస్టిలరీల్లో పనిచేశాడు. తర్వాత తన ప్రస్థానాన్ని గోవాకు మార్చుకున్నాడు. అక్కడా కొన్ని డిస్టిలరీల్లో పనిచేశాడు. సుదీర్ఘకాలంపాటు డిస్టిలరీల్లో పనిచేయడంతో అందులో ఉపయోగించే ఫార్ములాలను పసిగట్టాడు. ఏరకం మద్యం తయారీకి ఏ ఫార్ములా ఉపయోగించాలన్న దానిపై మంచి పట్టు సాధించాడు. తర్వాత డిస్టిలరీల నుంచి బయటకు వచ్చి గోవాలో లిక్కర్ హబ్‌లను నిర్వహించే స్థాయికి వెళ్లాడు.

గోవాలో కలిసిన చేతులు

వాస్తవానికి జనార్దనరావుకు, బాలాజీకి ఎలాంటి సంబంధం లేదు. జనార్దనరావు తెలంగాణాలో ఈ పేరుతో కొంతమంది భాగస్వాములను కూడగట్టుకుని బార్‌కు లైసెన్స్ తీసుకున్నాడు. ఆ సమయంలో హైదరాబాద్‌కు చెందిన రవి అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. అతడి ద్వారా బాలాజీకి జనార్దనరావు టచ్‌లోకి వెళ్లాడు. బార్‌లో భాగస్వాములతో కలిసి గోవా వెళ్లిన జనార్దనరావు అక్కడ బాలాజీని కలిశాడు. బాలాజీ చేస్తున్న మద్యం వ్యాపారం చూసిన జనార్దనరావుకు ఆశలు అమాంతంగా పెరిగాయి. ప్రీమియర్ బ్రాండ్ల మద్యాన్ని సరఫరా చేస్తానని బాలాజీ అతడికి ఆఫర్ ఇచ్చాడు. దీన్ని మరోలా ఉపయోగించుకోవాలని జనార్దనరావు భావించాడు. తర్వాత పలుమార్లు గోవాకు ఒంటరిగా వెళ్లిన జనార్దనరావు అతడిని మాత్రమే కలిసేవాడు. ఈ సందర్భంలో బాలాజీకి డిస్టిలరీల్లో పనిచేసిన అనుభవం ఉందన్న విషయాన్ని మిగతా 8లో..

బాలాజీ ఎక్కడ?

నకిలీ మద్యం తయారీకి సొంత ఫార్ములాను ఉపయోగించిన బాలాజీ కోసం ఎక్సైజ్ పోలీసులు గాలిస్తున్నారు. నకిలీ మద్యం వ్యవహారం వెలుగులోకి వచ్చాక అతడు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. చిత్తూరు జిల్లాలోని తన స్వగ్రామంలో పోలీసులు నిఘా పెట్టారు. బెంగళూరు కేంద్రంగా స్పిరిట్, కార్మెల్, ఇతర ముడిసరుకులు విక్రయించే వ్యాపారులతో అతడికి మంచి సంబంధాలు ఉన్నాయి. అతడు ఫోన్‌చేసి చెప్తే సరుకును పంపే వ్యాపారులు ఉన్నారు. నకిలీ మద్యం తయారీలో ఉపయోగించిన ముడి సరకు మొత్తం బెంగళూరు నుంచి వచ్చిందని అధికారులు ఇప్పటికే నిర్ధారించారు.



ధూం.. ధాం.. దీపావళి

- ఉమ్మడి జిల్లాలో బాణాసంచా సిద్ధం.. గోడౌన్లకు మందుగుండు సామగ్రి
- గొల్లపూడి హోల్‌సేల్ మార్కెట్‌లో ఊపందుకున్న విక్రయాలు 8

దీపావళికి మూడు రోజుల ముందే జిల్లాలో బాణాసంచా విక్రయాలు ఊపందుకున్నాయి. గొల్లపూడి హోల్‌సేల్ మార్కెట్‌లో జోరుగా విక్రయాలు సాగుతున్నాయి. అన్ని టపాసులపై 82 శాతం డిస్కౌంట్ ప్రకటించడంతో కొనుగోలుకు ప్రజలు క్యూ కడుతున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాలకు, మండల కేంద్రాలకు బాణాసంచా చేరింది.

దుర్గగుడి అభివృద్ధికి దాతలు ముందుకురావాలి

- దుర్గగుడి చైర్మన్, ఈవో పిలుపు

8

కంచికచర్ల పంచాయతీలో నిధుల దుర్వినియోగం నిజమే

- డీఎల్‌పీవో రాఘవన్

ఉత్సాహంగా గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్

అతను అధికారి కాదు. కానీ, అంతకుమించిన బిల్డప్ ఇస్తాడు. కార్యాలయంలో సబార్డినేటే అయినా సరిహద్దులు చెరిపేసుకున్నాడు. వసూళ్ల కోసం తానే అధికారినని దండోరా వేసుకున్నాడు. రాజకీయ పరిచయాలు, అధికారులతో సత్సంబంధాలను ఉపయోగించుకుని తనకు అడ్డే లేదన్నట్టుగా అడ్డగోలుగా వ్యవహరించాడు. చివరికి ఏసీబీకి చిక్కి కటకటాలపాలయ్యాడు. ఇదీ ఏసీబీకి చిక్కిన వాణిజ్య పన్నుల శాఖ సబార్డినేట్ కొండపల్లి శ్రీనివాసరావు చరిత్ర. ఓ ట్రాన్స్‌పోర్టు కార్యాలయం నుంచి రూ.16 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన అతడి బాగోతాలు బయటకు వస్తున్నాయి.

అవినీతి కొండ

వాణిజ్య పన్నులశాఖ సబార్డినేట్ కొండపల్లి అరాచకాలు

- గెజిటెడ్ అధికారిగా ప్రచారం చేసుకుని లంచాలు
- సరిహద్దులు దాటేసి.. ఇష్టానుసారంగా వసూళ్లు
- విజయవాడ రైల్వేస్టేషన్, వన్‌టౌన్ మార్కెట్ టార్గెట్
- వ్యాపారులను బెదిరించి రూ.లక్షల్లో డిమాండ్
- ఆ శాఖలోని విశాఖపట్నం అధికారి అండతోనే..
- ట్రాన్స్‌పోర్టు వ్యాపారి ఫిర్యాదుతో ఏసీబీ చేతికి..




కొండపల్లి శ్రీనివాసరావు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కొండపల్లి శ్రీనివాసరావు.. విజయవాడ వాణిజ్య పన్నుల శాఖలోని గవర్నరుపేట సర్కిల్‌లో అటెండర్. పనిచేసిన అన్నిచోట్లా లంచాలకు రుచిమరిగాడు. డిమాండ్ చేసిన మొత్తం చేతిలో పెడితేనే శాంతిస్తాడు. లేకపోతే చెలరేగిపోయి అరాచకం సృష్టిస్తాడు. అతను ఇంత దారుణంగా వ్యవహరిస్తున్నప్పటికీ అధికారులు ఏనాడూ చర్యలు తీసుకోలేదు. వాణిజ్య పన్నుల శాఖలో సీవీటీ (చెకింగ్ వెహికల్ ట్యాక్స్)ల్లో తానే ఓ అధికారిగా చెప్పుకొని భారీగా దండుకునేవాడు.

వన్‌టౌన్‌లో దందాలు

వన్‌టౌన్‌లో నివాసం ఉంటున్న శ్రీనివాసరావు రైల్వేస్టేషన్‌తో పాటు అక్కడి హోల్‌సేల్ మార్కెట్‌ను టార్గెట్ చేసుకుని మిగతా 8లో..

ఆదాయానికి మైనస్



రిజిస్ట్రేషన్ శాఖలో కార్డ్ ప్రైమ్-2.0 సాఫ్ట్‌వేర్‌లో మైనస్ నెంబర్లు ఇబ్బందులు తెచ్చి పెడుతున్నాయి. దీనివల్ల ఉమ్మడి కృష్ణాజిల్లాలో వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు ఆగిపోగా, ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

రిజిస్ట్రేషన్ శాఖలో మైనస్ నెంబర్ల తంటా

- కార్డ్ ప్రైమ్ 2.0లో మైనస్ నెంబర్ల రిజిస్ట్రేషన్లకు నో ఆప్షన్
- సీలింగ్ భూములకు సంబంధించి భారీగా ఇబ్బందులు
- రిజిస్ట్రేషన్లు జరగక తలలు పట్టుకుంటున్న యజమానులు
- కోర్టు వివాదాలతో కూడిన ఆస్తులకూ ఇవే అవస్థలు
- పూర్వం కో-ఆపరేటివ్ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వారికి కూడా..
- 'మైనస్' కారణంగా గిఫ్ట్ డీడ్స్, రిజిస్ట్రేషన్లకు అవకాశం లేని పరిస్థితి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో పూర్వ కోర్టు వివాదాలు, కో-ఆపరేటివ్ బ్యాంకుల్లో తనఖాలు పెట్టినవారు మైనస్ నెంబర్ల సమస్యలతో అల్లాడుతున్నారు. రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో అవన్నీ నిరర్థక ఆస్తులుగా ఉండిపోతున్నాయి. బ్యాంకుల్లో తనఖా పెట్టి విద్య, గృహ రుణాలు పొందటానికి కానీ, పెళ్లిళ్లు, ఫంక్షన్లు వంటి వాటికి సంబంధించిన అవసరాలకు కానీ అవి ఉపయోగపడట్లేదు.

మైనస్ నెంబర్లు అంటే..

అర్బన్ ల్యాండ్ సీలింగ్ మిగులు భూముల ఆక్రమణలు, తదనంతరం పట్టాలు ఇచ్చినా.. వివాదాల నేపథ్యంలో కోర్టులే రిజిస్ట్రేషన్లు నిర్వహించినపుడు మైనస్ నెంబర్లు ఇస్తారు. ఇద్దరు వ్యక్తుల మధ్య భూ, ఆస్తి గొడవలు వచ్చి న్యాయస్థానాలకు చేరితే న్యాయమూర్తులు ఎవరి ఆస్తులను వారికి నిర్దేశించే క్రమంలో కోర్టు ద్వారా రిజిస్ట్రేషన్లు చేస్తారు. అలాంటి వాటికి రిజిస్ట్రేషన్లు జరిగినా మైనస్ నెంబర్లు ఉంటాయి. అలాగే, పూర్వం కో-ఆపరేటివ్ బ్యాంకుల్లో తమ భూములను హామీగా పెట్టి రుణాలు తీసుకున్నపుడు ఇప్పటిలా మార్ట్‌గేజ్ కాకుండా రుణాలు ఇచ్చేవి. కో-ఆపరేటివ్ బ్యాంకులు ఒక పత్రాన్ని ఇచ్చేవి. ఆ పత్రాన్ని రిజిస్ట్రేషన్ శాఖలో ఇచ్చేవారు. అలాంటపుడు కూడా రిజిస్ట్రేషన్ శాఖలో వాటికి సంబంధించి మైనస్ నెంబర్లు కేటాయించేవారు. ఈ మైనస్ నెంబర్లు ఇవ్వటం ద్వారా ఆ ఆస్తులను మరొకరికి విక్రయించటానికి కానీ, మార్ట్‌గేజ్ పెట్టడానికి కానీ చెల్లుబాటు కాదు. అర్బన్ ల్యాండ్ సీలింగ్, ఇతర శాఖలు, అధికార సంస్థల నుంచి అభ్యంతరాలు లేని వాటికి మినహాయింపు ఇచ్చారు.

ఆప్షన్లు కల్పించాలి

ఉమ్మడి కృష్ణాజిల్లాలో న్యాయ సంబంధిత వివాదాలు, కో ఆపరేటివ్ బ్యాంకు తనఖా రుణాలకు సంబంధించిన వాటికే ఇప్పటికే మైనస్ నెంబర్లుగా ఉన్నాయి. ఇప్పుడు వీటికి సంబంధించి గిఫ్ట్ రిజిస్ట్రేషన్లు చేయాలంటే కుదరట్లేదు. మైనస్ నెంబర్లు ఉన్నవాటికి కూడా రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాల్సిన అవసరం ఉంది. కార్డ్ ప్రైమ్ 2.0లో అవకాశం కల్పిస్తే ఎంతోమందికి న్యాయం చేసినట్టు అవుతుంది. ప్రభుత్వానికి కూడా ఆదాయం వస్తుంది. ఇప్పటికే ఎల్‌పీ నెంబర్ల కారణంగా సబ్ డివిజన్లు జరగక చాలా రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. ఆదాయం కూడా తగ్గింది. ఇలాంటి వాటిని దృష్టిలో ఉంచుకుని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

నగరంలో యూఎల్‌సీ మిగులు భూముల బాధితులు

పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టం (అర్బన్ ల్యాండ్ సీలింగ్ యాక్ట్) మేరకు మిగులు భూముల్లో ఆక్రమణలు, తదనంతరం వాటికి పట్టాలు ఇవ్వటం, చేతులు మారటం మిగతా 8లో..

రౌడీషీటర్ సాయిపై పీడీ యాక్ట్

- అనుమతి ఇచ్చిన కోర్టు



మెండు సాయి

విజయవాడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అతని వెంట ఎప్పుడూ ఏదో ఒక ఆయుధం ఉంటుంది. మద్యం మత్తులో ఉంటే అతడి మాట అతడే వినడు. అడ్డొచ్చిన వారిని ఆయుధంతో ఒకటే పోటు పొడుస్తాడు. ఆ పోటు పడిన వ్యక్తి ప్రాణాలు కోల్పోతాడు. చాలా టెక్నిక్‌గా ఎదుటి వారి ప్రాణాలు తీసేస్తాడు. ఇదీ రౌడీషీటర్ మెండు సాయి నేరప్రవృత్తి. రామవరప్పాడు హనుమానగర్‌కు చెందిన సాయి చికెన్ షాపులో పనిచేస్తుంటాడు. మద్యం మత్తులో ఉన్నప్పుడు ఆయుధంతో వీరంగం చేస్తాడు. అతడిపై పటమట పోలీస్‌స్టేషన్‌లో తొమ్మిది కేసులు ఉన్నాయి. వాటిలో రెండు హత్య కేసులు, ఒక గంజాయి కేసు. ఆయుధం వెంటపెట్టుకుని తిరుగుతాడు. స్నేహితులతో కలిసి మద్యం తాగినప్పుడు, పేకాడినప్పుడు ఏదైనా వివాదం జరిగితే వెంటనే ఆయుధానికి పని చెబుతాడు. ఈవిధంగా తన బంధువును చంపేశాడు. ఈ ఏడాది జనవరిలో రామవరప్పాడుకు చెందిన కార్మికుడిని శ్మశానంలో పేకాట ఆడి చంపేశాడు. తాను చేసిన నేరాలకు ఎవరైనా సాక్ష్యం చెబితే వారినీ బెదిరిస్తాడు. ఈ మధ్యకాలంలో సాయి ఆగడాలు పెరిగిపోవడంతో పటమట పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. దీనికి కోర్టు శుక్రవారం అనుమతి ఇచ్చింది.

తాడిగడప మున్సిపాలిటీ | పేరు మార్పు

పెనమలూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు నియోజకవర్గంలోని వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ పేరును తాడిగడప మున్సిపాలిటీగా మారుస్తూ శుక్రవారం ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. 2024, ఆగస్టు 9న మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి నేతృత్వంలో ప్రజాభిప్రాయ సేకరణ చేసి వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ పేరును తాడిగడప మున్సిపాలిటీగా మార్చాలని తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి పంపారు. తాడిగడప మున్సిపాలిటీ పేరును మారుస్తూ ప్రభుత్వం శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది.



అద్భుతంగా..

మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థలో శుక్రవారం జరిగిన నవోన్మేషికోత్సవం కల్చరల్ ఫెస్ట్‌లో గిరిజన నృత్యం చేస్తున్న విద్యార్థిని

అవినీతిమయంగా

ఉపాధి హామీ పథకం



నాడు ఉపాధి పనుల్లో భాగంగా కానుమోలు చెరువు పూడికతీత



నేడు గుర్రపుడెక్కతో నిండి ఎందుకూ పనికిరాకుండా..

- తూతూమంత్రంగా పనులు చేసి బిల్లులు
- కానుమోలు చెరువు పూడికతీత పనులే నిదర్శనం
- పూడిక తీశారు.. గుర్రపుడెక్క పెంచారు..
- అరకొరగా పనులు.. దండిగా బిల్లులు..
- బాపులపాడు మండల పరిధిలో భారీగా అవినీతి
- బొమ్ములూరులో బోగస్ మస్తర్ల మాయాజాలం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/హనుమాన్ జంక్షన్ రూరల్) : ఉపాధి కూలీలకు పనులు కల్పించేందుకు ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) అవినీతిమయమైంది. ప్రజాధనాన్ని దోచుకోవడానికి అక్రమార్కులకు ఇదొక మార్గమైంది. పర్యవేక్షించాల్సిన అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు మిగతా 8లో..

ధూం.. ధాం.. దీపావళి

» ఉమ్మడి జిల్లాలో బాణాసంచా సిద్ధం.. గోడౌన్‌లకు మందుగుండు సామగ్రి

» గొల్లపూడి హోల్‌సేల్ మార్కెట్‌లో ఊపందుకున్న విక్రయాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ)

హిందువుల పండుగల్లో ప్రత్యేకమైనది దీపావళి.. ఏటా అశ్వయుజ అమావాస్య రోజున దీపావళి పండుగను జరుపుకోవటం ఆనవాయితీ. ఈఏడాది దీపావళికి మోత మోగించటానికి మందుగుండు సామగ్రి సిద్ధం చేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా గోడౌన్లలో ఇప్పటికే సరకు పెద్దఎత్తున దిగుమతి అయింది. విజయవాడ గొల్లపూడి హోల్‌సేల్ మార్కెట్‌కు భారీఎత్తున సరకు దిగుమతి అయ్యింది. గన్నవరం, కంకిపాడు, మైలవరం తదితర మండలాల్లోని గోడౌన్లకు బాణసంచా భారీగా దిగుమతి అయ్యింది. దీపావళి సందడికి నగరం సిద్ధమౌతోంది. రీటెయిల్‌గా బాణసంచా విక్రయాలు జరిపేవారు గోడౌన్‌లలో సరుకు భద్రపరిచారు. ఇప్పటికే హోల్‌సేల్ దుకాణాల్లో విక్రయాలు జరుగుతుండగా.. రిటైల్ వ్యాపారులు దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతి కోసం ఎదురు చూస్తున్నారు.

వెలుగుల పండుగ

ఏటా అశ్వయుజ అమావాస్య రోజున దీపావళి పండుగను జరుపుకోవటం ఆనవాయితీ. నరకాసురుడిని సంహరించిన ఆనందంలో ఈ పండుగను జరుపుకోవడం భారతీయ సంస్కృతి. హిందువులు, జైనులు, సిక్కులు, బౌద్ధులు ఈ పండుగను అత్యంత వైభవంగా జరుపుకుంటారు. అమావాస్య రోజున చీకట్లను చీల్చేందుకు జనం మొత్తం జాగ్రత్తమై దీపాలను వెలిగించడం, నరకాసుర, రావణాసుర సంహారానికి ప్రతీకగా టపాసులు కాల్చడం ఆనవాయితీ. కాలక్రమేణా టపాసులు కాల్చే పద్ధతి ఎప్పటికప్పుడు రూపు మార్చుకుంటుంది.



నింగి, నేల వెలుగులు నింపే టపాసులు

ఆకాశానికి వెలుగులు అద్దే బాణసంచా, నేలకు రంగులద్దే టపాసులు ఈ ఏడాది దీపావళికి సిద్ధమయ్యాయి. యువతరం కోరికకు అనుగుణంగా తయారుచేసిన మందుగుండు సామగ్రిని వ్యాపారులు అందుబాటులోకి తెచ్చారు. 10 లక్షల జనాభా పైబడిన విజయవాడ నగరంలో వీటి గిరాకీ ఎక్కువగా ఉంటుంది. ప్రతి వీధిలోనూ మూడు రోజులపాటు టపాసుల మోత మోగుతూనే ఉంటుంది. పండుగ రోజు అర్ధరాత్రి వరకు నగర వ్యాప్తంగా నింగిలోకి నిప్పులు విరజిమ్ముతూ బాణసంచా కాల్చుతారు. దీపావళి బాణసంచా కాల్చే విషయంలో యువత ఆకాంక్షలు ఎప్పటికపుడు మారుతూనే ఉన్నాయి. దీనిఆధారంగానే తయారీదారులు వారికనుగుణంగా 500వాలా, 1000 వాలా, 2000వాలా, 5000వాలా వంటి ఎన్నో రకాలను మార్కెట్‌లకు పరిచయం చేస్తున్నారు. ఈ ఏడాది బాణసంచాలో కొత్తదనాన్ని అందిస్తున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. 120 షార్ట్స్, 60 షార్ట్స్, ఆకాశంలో రంగులు విరజిమ్మేలా టపాసులు సిద్ధం చేశారు. చిట్‌పట్‌లు, కాకర పువ్వొత్తులు, మతాబులు, లక్ష్మీఅవుట్‌లు, పాముబిళ్లలు, వంకాయ బాంబుల్లో సైతం నూతనత్వాన్ని అద్దినట్టు తయారీదారులు చెబుతున్నారు. రాకెట్‌లా నిప్పులు కక్కుతూ నింగికి ఎరిగే మిస్సైల్ విజల్‌లు అందుబాటులోకి వచ్చాయి. అధిక శబ్దం చేసే త్రిబుల్ ఎక్స్ హెవీ బాంబ్, ఆకాశంలో పువ్వులు పూయించే ఫ్లవర్ బాంబ్‌లు రెడీగా ఉన్నాయి.

గొల్లపూడి మార్కెట్‌లో జోరుగా విక్రయాలు

పండుగకు మూడురోజుల ముందుగానే నగరంలో బాణసంచా విక్రయాలు ఊపందుకున్నాయి. గొల్లపూడి హోల్‌సేల్ మార్కెట్‌లో జోరుగా విక్రయాలు సాగుతున్నాయి. అన్ని టపాసులపై 82 శాతం డిస్కౌంట్ ప్రకటించడంతో కొనుగోలుకు ప్రజలు క్యూ కడుతున్నారు. కుటుంబసమేతంగా వచ్చి మందుగుండు సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఒక్క దుకాణంలో మాత్రమే విక్రయాలు ప్రారంభమయ్యాయి. అయితే జిల్లాలలోని అన్ని నియోజకవర్గ కేంద్రాలకు, మండల కేంద్రాలకు బాణా సంచా చేరింది. ఆయాప్రాంతాలతో పాటు, నగరంలోనూ రిటైల్ వ్యాపారానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వాల్సి ఉంది. రిటైల్ దుకాణ సముదాయల ఏర్పాటు తరువాత విక్రయాలు మరింత ఊపందుకుంటాయి.



తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి, కీర్తిలాల్ జ్యూయలర్స్ నిర్వాహకులు, దాతల ఈవో, చైర్మన్

దుర్గగుడి అభివృద్ధికి దాతలు ముందుకురావాలి

» దుర్గగుడి చైర్మన్, ఈవో పిలుపు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు దాతలు ముందుకురావాలని దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వీకే శీనానాయక్‌లు కోరారు. శుక్రవారం మహామండపం 6వ అంతస్తులో తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి, కీర్తిలాల్ జ్యూయలరీ యాజమాన్యం, పలువురు భక్తులు దాతలతో దేవస్థానం అభివృద్ధిపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొలుత దేవస్థానం అభివృద్ధి గురించి ఈవో ప్రజంటేషన్ చేసి వివరించారు. బంగారుగోపురం, మల్లేశ్వరుని ధ్వజస్తంభం స్వర్ణ తాపడం చేయడానికి, భక్తుల అవసరాల నిమిత్తం ఎలక్ట్రిక్ బస్సుల ఏర్పాటుకు దాతలు ముందుకురావాలని కోరారు. చైర్మన్ బొర్రా రాధాకృష్ణ మాట్లాడుతూ, దాతలు ముందుకు వచ్చి సహాయసహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో పాలక మండలి ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకరబాబు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివాహ ముహూర్తాలు ఎక్కువగా ఉండటంతో నూతన వధూవరులు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు తరలివచ్చారు. అమ్మవారికి తలనీలాలు సమర్పించుకుని, కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసి కొండపైన క్యూలలో కనకదుర్గమ్మవారి కరుణ కోరుతూ ఆర్తితో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో వీకే శీనానాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, అధికారులు, సిబ్బంది క్యూలైన్లలో భక్తులను నియంత్రించారు. తాగునీరు, ఉచిత ప్రసాదం, అన్నప్రసాదం సత్వరం అందేలా చర్యలు తీసుకున్నారు.



తిరుపతమ్మ ఆలయంలో సినీనటి రాశి కుటుంబసభ్యులు

తిరుపతమ్మను దర్శించుకున్న సినీనటి రాశి

పెనుగంచిప్రోలు : ప్రముఖ సినీనటి రాశి కుటుంబసభ్యులతో శుక్రవారం సాయంత్రం తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయ అర్చకులు వేదపండితులు వారికి అశీర్వచనం చేసి అమ్మవారి, స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

కల్కి ఆక్రమణలపై విచారణ చేపట్టాలి

» ఏపీ హేతువాద సంఘం

గాంధీనగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆక్రమించిన ఆటవీ భూములను రక్షించలేని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించడాన్ని ఏపీ హేతువాద సంఘం స్వాగతించింది. అదే జిల్లాలో కల్కి వందలాది ఎకరాల ఆటవీ భూములను ఆక్రమించి ఆశ్రమాల పేరుతో మోసం చేస్తుంటే అక్కడి అధికారులపై చర్యలకు ఆదేశించకపోవడానికి కారణమేంటని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య ప్రశ్నించారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. తిరుపతి జిల్లాలోని రెవెన్యూ అధికారులు, కల్కి ఆశ్రమ నిర్వాహకుల మధ్య 'క్విడ్ ప్రోకో' గుట్టురట్టు చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిక మండలం 295 సర్వే నంబర్‌లోని కోట్లాదిరూపాయల అంజూర్ ఆటవీ భూమిలో 21 ఎకరాలు కల్కి ట్రస్టు నిర్వాహకులు ఆక్రమించడం జరిగిందని, ఎటువంటి అనుమతులు లేకుండా ఆశ్రమం నిర్మించారని ఆరోపించారు. ఈ భూమిని రెవెన్యూ భూమిగా చూపేందుకు అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్పారు. తక్షణమే ఆటవీశాఖ మంత్రి జోక్యం చేసుకుని కల్కి ఆక్రమిత ఆటవీ భూములపై విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకుని భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. సీనియర్ జర్నలిస్టు రంగారెడ్డి, హేతువాద సంఘం సభ్యులు పూర్ణగాంధీ, జగన్మోహనరావు, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి కొండ

(7వ పేజీ తరువాయి)

దందాలు సాగించినట్టు ఏసీబీ అధికారులు నిర్ధారించారు. శ్రీనివాసరావు హోదాను మరిచి తనకు తానే గెజిటెడ్ అని చెప్పుకొంటాడు. ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, హోల్‌సేల్ షాపుల వద్దకు వెళ్లి బెదిరింపులకు దిగుతాడు. ఉన్నతాధికారులు ఎలాంటి టాస్క్ అప్పజెప్పకపోయినా కన్నుపడిన వ్యాపారాల వద్దకు వెళ్లి డబ్బు డిమాండ్ చేస్తాడు. బిల్లు పుస్తకాలు, ఇన్వాయిస్‌లను పరిశీలించి అందులో ఉన్న లోపాలను పట్టుకుని డబ్బు భారీగా డిమాండ్ చేస్తాడు. ఈ విధంగా నెలకు లక్షల రూపాయలను వసూళ్ల రూపంలో తీసుకెళ్తాడు. అధికారులు తనిఖీలకు రాకుండా చూసుకుంటానని చెప్పి తెరచాటు వ్యాపారాలు చేసేవారి నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేసేవాడు. కొండపల్లి శ్రీనివాసరావు పాపం పండింది. వన్‌టౌన్ జెండాచెట్టు సెంటర్‌లో ఉన్న ట్రాన్స్‌పోర్టు కార్యాలయానికి గురువారం రాత్రి వెళ్లి సీటీటీ పేరుతో తనిఖీలు చేశాడు. యజమాని నుంచి రూ.20 వేలు డిమాండ్ చేసి, రూ.16 వేలతో సరిపెట్టుకున్నాడు. తనిఖీల పేరుతో వెళ్లిన ప్రతిసారీ కొండపల్లి శ్రీనివాసరావు ఇలా చేస్తుండటంతో ఆ యజమాని విసుగుచెంది ఏసీబీని ఆశ్రయించాడు.

వన్‌టౌన్‌లో వసూళ్లు

కొండపల్లి శ్రీనివాసరావు అరాచకాలు రైల్వేస్టేషన్, వన్‌టౌన్ హోల్‌సేల్ మార్కెట్ ప్రధాన కేంద్రాలుగా సాగాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వన్‌టౌన్‌లోని హోల్‌సేల్ మార్కెట్‌కు పలు రకాల గూడ్స్ సరుకు నిత్యం వస్తుంటుంది. పార్శిల్ కార్యాలయం నుంచి బయటకు రాగానే పట్టుకోవడానికి రాత్రిపూట శ్రీనివాసరావు రైల్వేస్టేషన్ పార్శిల్ ఆఫీసు వద్ద కాపుగా సేవాడు. గూడ్స్‌తో వాహనం బయటకు రాగానే తనిఖీ అధికారి మాదిరిగా హడావిడి చేసి బిల్లులు చూపించమని బెదిరించేవాడు. బిల్లులు ఉన్నా లేకపోయినా వసూళ్లు మాత్రం చేసేవాడు. బిల్లులు లేని సరుకు యజమానుల నుంచి లక్షలాది రూపాయలు దండుకుని వెళ్లేవాడు. హోల్‌సేల్ మార్కెట్‌లోని వివిధ వ్యాపార సముదాయాల వద్దకు వెళ్లి వ్యాపారులను బెదిరించి భారీగా డబ్బు దండేవాడు. లక్ష రూపాయల నుంచి బేరం సాగేది. సరకు విలువను బట్టి డబ్బు డిమాండ్ చేసేవాడు. శ్రీనివాసరావు గవర్నరుపేట సర్కిల్‌లో పనిచేస్తున్నప్పటికీ ఆ సరిహద్దులను మరిచి వ్యవహరించేవాడు. మొదట్లో విజయవాడలో పనిచేసేవాడు. ఇక్కడ ఆరోపణలు రావడంతో ఉయ్యూరు సర్కిల్‌కు బదిలీ చేశారు. అక్కడ కూడా వ్యవహారాలు చక్కబెట్టినట్టు వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులు చెబుతున్నారు. తర్వాత అక్కడి నుంచి మళ్లీ విజయవాడకు చేరుకుని గవర్నరుపేట సర్కిల్‌లో పోస్టింగ్ సంపాదించుకున్నాడు. రెండు జిల్లాల్లోనూ ఉన్న సర్కిళ్లకు తానే అధికారిని అన్నట్టు వ్యవహరించి వ్యవహారాలు చక్కబెట్టేవాడు.

వైజాగ్ అధికారి అండతో..

కొండపల్లి శ్రీనివాసరావుపై పలువురు వ్యాపారులు అనేకసార్లు ఫిర్యాదు చేశారు. అయినా ఇప్పటివరకు అతనిపై చర్యలు తీసుకోలేదు. దీనికి ప్రధాన కారణం కొంతమంది అధికారులేనని వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులు బహిరంగంగా చెబుతున్నారు. ఏ సర్కిల్‌లో పనిచేసినా అక్కడ అధికారులను ప్రసన్నం చేసుకోవడంలో కొండపల్లి శ్రీనివాసరావు దిట్ట. అధికారుల అవసరాలను గుర్తించి అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తుంటాడు. దీంతో అతనిపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకోలేదు. ఇంతకుముందు విజయవాడలో పనిచేసి ప్రస్తుతం వైజాగ్‌లోని రీజనల్ ఆడిట్ అండ్ విజిలెన్స్ విభాగంలో కీలక స్థానంలో ఉన్న ఒక అధికారి అండ శ్రీనివాసరావుకు ఉందని వాణిజ్యపన్నుల శాఖలో ప్రచారం జరుగుతోంది. అధికారి సోదరుడు విజయవాడలో కీలక స్థానంలో పనిచేశాడు. ఆ సమయంలోనే అన్నదమ్ములిద్దరినీ గుప్పెట్లో పెట్టుకుని శ్రీనివాసరావు వ్యవహారాలు చక్కబెట్టాడు.

ఈనెల 31 వరకు రిమాండ్

కొండపల్లి శ్రీనివాసరావును ఏసీబీ అధికారులు శుక్రవారం సాయంత్రం కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి పి.భాస్కరరావు 31వ తేదీ వరకు రిమాండ్ విధించారు. అనంతరం శ్రీనివాసరావును విజయవాడ జిల్లాజైలుకు తరలించారు.

అవినీతిమయంగా

(7వ పేజీ తరువాయి)

ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. బాపులపాడు మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల్లో రూ.లక్షల్లో అవినీతి జరిగిందని జిల్లాస్థాయి అధికారులే తేల్చారు. కొయ్యూరు, బొమ్ములూరులో జరిగిన అవినీతిపై ప్రజలు ఫిర్యాదు చేయగా, జిల్లా అంబుడ్స్‌మెన్ ధ్రువీకరించింది. అయినా ఫీల్డ్ అసిస్టెంట్లపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రూ.వేలల్లో జరిమానా విధించి చేతులు దులుపుకొన్నారు.

ఇదేం పూడికతీత

బాపులపాడు మండలం కానుమోలు గ్రామంలోని చెరువు పూడికతీత పనులు ప్రశ్నార్థకంగా మారాయి. చెరువును పూడిక తీసి నీటినిల్వ సామర్థ్యాన్ని పెంచాలని పంచాయతీ అధికారులు నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా గత ఏప్రిల్‌లో గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పూడిక తీయించారు. దీనిద్వారా అటు ఉపాధి పనులు కల్పించడంతో పాటు, ఇటు చెరువు పూడికతీత కూడా చేయొచ్చనుకున్నారు. కానీ, పూడిక తీసి అలాగే వదిలేయడంతో నేడు ఆ చెరువులో గుర్రపుడెక్క పెరిగి ఎందుకూ పనికిరాకుండా పోయింది. దీనిని గతంలో చేపల చెరువుగా వేలం నిర్వహించేవారు. దీనివల్ల పంచాయతీకి ఎంతో కొంత ఆదాయం వచ్చేది. పూడికతీత పేరుతో చెరువును ఈ పరిస్థితికి తీసుకురావడంతో ఎందుకూ పనికిరాకుండా పోయింది. రూ.5 లక్షలు ఖర్చుచేసి చేపట్టిన పూడికతీత వల్ల ఎలాంటి ఉపయోగం లేకపోగా, చెరువు మొత్తం గుర్రపుడెక్కతో నిండి నిరుపయోగంగా మారింది. పశువులు నీరు తాగేందుకు కూడా పనికిరాకుండా పోయింది.

జీజీఐ నిబంధనలకు పాతర

జీజీఐ (గుడ్ గవర్నెన్స్ ఆఫ్ ఇండియా) ప్రకారం ఉపాధి పనులు నాణ్యతగా ఉండాలి. ఫైళ్లు సక్రమంగా ఉంచడంతో పాటు కొలతలు తప్పనిసరిగా పాటించాలి. కానీ ఎక్కడా ఈ నిబంధనలు పట్టించుకోవట్లేదు. మస్తర్లలో కూడా మాయాజాలం నడుస్తోంది. రోజూ ఉదయాన్నే కూలీలు పనిలోకి రాగానే మస్తర్లలో హాజరు వేయాలి. గ్రూప్ ఫొటో అప్‌లోడ్ చేయాలి. ఇక్కడే ఫీల్డ్ సిబ్బంది తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. పనులకు రాని వారిని, వేరే ఉద్యోగాలు చేస్తున్న వారిని, తమకు అనుగుణంగా ఉన్నవారిని.. వచ్చినట్టుగా చూపిస్తూ అవినీతికి పాల్పడుతున్నారు. ఒక మస్తరులో 10 మంది కూలీలు పనిచేస్తుంటే, వారికి వారానికి రూ.16 వేలు నగదు అందుతుంది. వచ్చిన నగదును వాటాలు వేసి పంచుకుంటున్నారు. బొమ్ములూరులో వయోజన విద్యా వలంటీర్‌గా పనిచేస్తున్న కుటుంబానికి చెందిన మహిళలకు.. పనికి రాకపోయినా జాబ్‌కార్డు క్రియేట్ చేసి మస్తర్లు వేయడంతో పాటు నగదు కూడా బదిలీ చేయడం విమర్శలకు తావిచ్చింది.

అడ్డుకట్ట వేయాలి

ఉపాధి హామీ పనుల పేరిట ప్రజాధనాన్ని దోచుకుంటున్నారు. పథకాన్ని పర్యవేక్షించాల్సిన అధికారుల అలసత్వం వల్ల దోపిడీ నిరంతరాయంగా సాగుతోంది. సామాజిక తనిఖీ ప్రజా వేదిక ద్వారా గ్రామస్తుల ఫిర్యాదులపై విచారణ చేపట్టాల్సిన అధికారులు.. అధికారంలో ఉన్నవారు చెప్పినట్టు రాసుకుని వెళ్లిపోతున్నారు.



పంచాయతీ కార్యాలయంలో విచారణ చేస్తున్న డీఎల్‌పీవో

కంచికచర్ల పంచాయతీలో నిధుల దుర్వినియోగం నిజమే

» డీఎల్‌పీవో రాఘవన్

కంచికచర్లరూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కంచికచర్ల గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన జూనియర్ అసిస్టెంట్ ప్రస్తుతం గండ్రాయి పంచాయతీలో పనిచేస్తున్న షేక్ నాగుల్‌మీరా, బిల్ కలెక్టర్ జంగం వెంకట గుప్తాలపై చర్యలకు సిఫార్సు చేస్తున్నట్టు డీఎల్పీవో రాఘవన్ తెలిపారు. నిధుల గోల్‌మాల్‌పై డీఎల్‌పీవో కంచికచర్ల పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం విచారణ జరిపారు. ప్రజల నుంచి పన్నులరూపంలో వసూలు చేసిన నిధులతో పాటు పంచాయతీ సొమ్ము రూ.24.41 లక్షలు ఇరువురు ఉద్యోగుల ద్వారా దుర్వినియోగం అయినట్టు నిర్ధారించారు. విచారణ అనంతరం డీఎల్‌పీవో రాఘవన్ విలేకరులతో మాట్లాడుతూ.. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన నాటి పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ షేక్ నాగులు, బిల్ కలెక్టర్ జంగం వెంకట గుప్తాలపై చర్యలకు సిఫార్సు చేస్తున్నట్టు తెలిపారు. పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై శాఖాపరమైన విచారణలో నిబంధనలకు విరుద్ధంగా ఇరువురు ఉద్యోగులు పన్నులు రూపంలో వచ్చిన సొమ్ము పంచాయతీకి జమ చేయకుండా దుర్వినియోగం చేశారని తేలిందన్నారు. జూనియర్ అసిస్టెంట్ షేక్ నాగులు రూ.13,30,420, బిల్ కలెక్టర్ జంగం వెంకట గుప్తా రూ.11,10,280 దుర్వినియోగం చేసినట్టు విచారణలో తేలిందన్నారు. ఈ నిధులు వివిధరకాల పనులకు ఖర్చుపెట్టినట్టు చెబుతున్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధమని, వసూలు కాబడిన సొమ్ము పంచాయతీకి జమచేసిన తర్వాతే, కార్యదర్శి ద్వారా ఖర్చుచేయాల్సి ఉంటుందన్నారు. నిధులను పంచాయతీ కార్యదర్శికి తెలిసే ఖర్చు చేశామని చెబుతుండటంతో నాటి కార్యదర్శులు మీర్జావలి, రవికుమార్‌లను కూడా విచారిస్తున్నట్టు, ఉన్నతాదికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు. ఈవోపీఆర్డీ నాని బాబు, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాలు తిలకిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, ఇతర అధికారులు

ఉత్సాహంగా గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్

విద్యాధరపురం : భవానీపురం పున్నమి ఘాట్‌లో గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్ ఉత్సాహంగా జరుగుతోంది. ఒకవైపు జీఎస్టీ సంస్కరణల సేవింగ్స్‌తో, ప్రత్యేక ఆఫర్లతో కొనుగోలుదారులు వివిధ వస్తువులను కొనుగోలు చేస్తూ సరికొత్త షాపింగ్ అనుభూతిని సొంతం చేసుకుంటున్నారు. మరోవైపు సాంస్కృతిక కార్యక్రమాలు ఫెస్టివల్ కు కొత్త సొబగులు అద్దుతున్నాయి. శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమాల్లో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, వివిధ శాఖల అధికారులతో కలిసి పాల్గొని చిన్నారులను ఉత్సాహపరిచారు.

భార్య చనిపోయిందని.. మనస్తాపంతో భర్త ఆత్మహత్య!

విద్యాధరపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణంగా భార్య చనిపోయిందని మనస్తాపం చెందిన భర్త ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై శుక్రవారం భవానీపురం స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భవానీపురం శివాలయం సెంటర్‌లో వల్లభదాసు రామ్మోహన్‌రావు కుటుంబసభ్యులతో ఉంటున్నాడు. ఓ బార్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడి తల్లి నాలుగు నెలల క్రితం అనారోగ్యంతో చనిపోయింది. అప్పటి నుంచి మనస్తాపం చెందిన రామ్మోహన్‌రావు తండ్రి శోభనాద్రి (83) పలుఅనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం శోభనాద్రి ఇంట్లో కబోర్డు హ్యాండిల్‌కు నవ్వారుతో ఉరివేసుకుని ఉండటాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రామ్మోహన్‌రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. భార్య చనిపోయిందన్న బాధతో పాటు పలు అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెంది తనతండ్రి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని రామ్మోహన్‌రావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

తిరువూరు తహసీల్దార్ సస్పెన్షన్

తిరువూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరువూరు తహసీల్దార్ ఉదయభాస్కర్‌ను సస్పెన్షన్‌కు గురయ్యాడు. వత్సవాయి మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించే సమయంలో ఆయన జిల్లా జాయింట్ కలెక్టర్ ఉత్తర్వులను అమలు చేయడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు సస్పెన్షన్ వేటు పడింది. ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నాగమణి బాధ్యతలు చేపట్టారు.



ఏపీఎఫ్‌పీఐఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు వెలగపూడి సాంబశివరావు, వి.వంశీ, కార్యవర్గ సభ్యులు

ఏపీఎఫ్‌పీఐఎఫ్ నూతన కార్యవర్గం

విజయవాడ సిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్(ఏపీఎఫ్‌పీఐఎఫ్) అధ్యక్షులుగా వెలగపూడి సాంబశివరావు, ప్రధాన కార్యదర్శిగా వి.వంశీ ఎన్నికయ్యారు. ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్‌కు అనుబంధంగా ఉన్న ఏపీఎఫ్‌పీఐఎఫ్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో జరిగింది. అనంతరం జరిగిన ఫెడరేషన్ ఎన్నికల్లో సభ్యులు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా పొట్లూరి భాస్కరరావు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ప్రసాద్, కోశాధికారిగా డాక్టర్ చల్లా శేఖర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా వి.రామ్మోహన్ ఎన్నికయ్యారు. రాష్ట్రంలో నాణ్యమైన ఉత్పత్తుగా సాధించి, యువతకు ఉపాధి కల్పించే దిశగా అడుగులు వేస్తామని సమాఖ్య నూతన ప్రతినిధులు వెల్లడించారు. ప్రవేటు ఇన్వెస్టర్‌లను ప్రోత్సహిస్తూ, అత్యాధునికి సాంకేతికతను అందిపుచ్చుకుంటూ, ఉత్పత్తిదారులను, రైతులను సమన్వయం చేసేలా ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు.

ఆలయ అభివృద్ధికి సహకరించండి: బుద్ధ ప్రసాద్

మోపిదేవి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపు నిచ్చారు. దేవస్థానం ఆధీనంలోని కోనేరు ప్రాంగణం, దేవస్థానం ప్రాంగణంలో సీజీఎఫ్ నిధులు రూ.1.20 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన, భూమిపూజ చేశారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో రూ. 1.20 కోట్లతో అదనంగా టాయిలెట్ బ్లాక్, కేశఖండనశాల నిర్మించనున్నట్లు తెలిపారు. నాగులచవితి సందర్భంగా 25న దేవస్థానంలో నిర్వహించే కార్యక్రమాల వివరాల పోస్టర్లు, ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

కిక్కు ఎక్కేలా.. ఫార్ములా

(7వ పేజీ తరువాయి)

గ్రహించాడు. మద్యం తయారీకి ఉపయోగించే ఫార్ములాను చెప్పాలని జనార్దనరావు అడిగాడు. తన వద్ద ఉన్న ఫార్ములా జనార్దనరావు చేతుల్లోకి వెళ్తే మొదటికే మోసం వస్తుందని భావించిన బాలాజీ దానికి అంగీకరించలేదు. మద్యం తయారీ ఎక్కడ చేసినా తాను స్వయంగా వచ్చి ముడి సరకులతో మిశ్రమం చేసి ఇస్తానని చెప్పాడు. ఫార్ములా మాత్రం ఇవ్వనని స్పష్టం చేశాడు. ఇక్కడే జనార్దనరావు వ్యూహం బెడిసికొట్టింది. మద్యం వ్యాపారంలో బాలాజీకి ఉన్న అనుభవంతో అతడితో మంచి సంబంధాలు నడిపాడు. ఫార్ములా చేతికొచ్చాక బాలాజీని వదిలించుకుందామనుకున్నాడు. బాలాజీ మాత్రం ఫార్ములా తప్ప ఏదైనా అడగమనడంతో జనార్దనరావుకు దిక్కు తోచలేదు. ములకలచెరువు, ఇబ్రహీంపట్నంలో ఉన్న అనధికార డిస్టిలరీల్లో బాలాజీ తన వద్ద ఉన్న ఫార్ములా ప్రకారమే మద్యం తయారు చేసి ఇచ్చాడు. ఈ మిశ్రమం చేసేటప్పుడు తాను మాత్రమే ఉండేవాడు. సహాయకులుగా ఇద్దరు, ముగ్గురిని ఉంచుకునేవాడు. ఇలా సీసాల్లో పోయడానికి వీలుగా మద్యం తయారు చేయడానికి బాలాజీ అడ్వాన్స్‌గా రూ.20 లక్షలు తీసుకున్నాడు. తర్వాత విక్రయించిన సరుకులో ఒక్కో సీసాకు పైసల లెక్కన కొంత కమీషన్ తీసుకున్నట్టు తెలిసింది.

ఆదాయానికి మైనస్

(7వ పేజీ తరువాయి)

వంటివి నగరంలో జరిగాయి. ఈ క్రమంలో కొన్నింటికి చట్టబద్ధత కల్పిస్తూ ప్రభుత్వం పూర్వం జీవో ఇచ్చింది. అలాంటి వాటికి సంబంధించిన వాటిలో కొన్నింటికి పూర్వం మాన్యువల్‌గా ఉన్నప్పుడు రిజిస్ట్రేషన్లు చేశారు. కంప్యూటరీకరణ ప్రారంభమయ్యాక కూడా కొంతకాలం రిజిస్ట్రేషన్లు జరిగాయి. కార్డ్ ప్రైమ్ సాఫ్ట్‌వేర్ వచ్చినప్పటి నుంచి కూడా అవి మైనస్ నెంబర్లుగా ఉంటున్నాయి. ప్రస్తుత కార్డ్ ప్రైమ్ 2.0 వెర్షన్‌లో కూడా ఈ మైనస్ నెంబర్లకు రిజిస్ట్రేషన్లు జరగట్లేదు. నగరంలో ఇలాంటి బాధితులు వందల సంఖ్యలో ఉన్నారు.



కార్పొరేషన్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానా

భారతీనగర్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): తూర్పులోని సర్కిల్- 3 పరిధిలో రోడ్లపై చెత్త వేసిన, కార్పొరేషన్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై శుక్రవారం పటమటలోని సర్కిల్- 3 కార్యాలయంలో విచారణ జరిపి జరిమానాలు విధించారు. సర్కిల్- 3 పరిధిలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నమోదుచేసిన 30 కేసులపై మొబైల్ కోర్టులో 8వ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ గోలీ లెనిన్‌బాబు విచారణ చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ.9540 జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవోహెచ్- 3 డాక్టర్ గోపాల్ నాయక్, శానిటరీ సూపర్‌వైజర్స్ బాలాజీ శ్రీనివాస మూర్తి, సర్కిల్- సంబంధించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు సువర్ణాధ్యాయం

● శాప్ చైర్మన్ రవినాయుడు

లబ్బీపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో గూగుల్‌డేటా సెంటర్ రావడం రాష్ట్రానికి సువర్ణ అధ్యాయమని శాప్ చైర్మన్ రవినాయుడు తెలిపారు. ఇందిరాగాంధీ స్టేడియంలోని శాప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం సహకారంతో మంత్రి లోకేష్ కృషితో రాష్ట్రానికి అనేక పరిశ్రమలు వస్తున్నాయన్నారు. రాష్ట్రానికి వస్తున్న పరిశ్రమలు, పెట్టుబడులు చూసి ఓర్వలేక వైసీపీ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించే విధంగా మాట్లాడుతున్నారని తెలిపారు. కర్నూలులో జరిగిన సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

జీఎస్‌టీతో క్రీడారంగానికి కొత్త వెలుగులు

సూపర్ సేవింగ్స్ అవగాహన ర్యాలీలో కలెక్టర్


ర్యాలీ ప్రారంభిస్తున్న లక్ష్మీశ, ఎస్.ప్రశాంత్ కుమార్, బాలికలతో ముచ్చటిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

లబ్బీపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ 2.0 సంస్కరణలతో క్రీడా రంగానికి కొత్త వెలుగులు వచ్చాయని, ఈ రంగానికి మరింత ఊపు వచ్చేలా క్రీడా సామాగ్రి, ఆట బొమ్మలు మరింత చౌకగా లభ్యమవుతున్నాయని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. సూపర్ జీఎస్‌టీ సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ప్రత్యేక ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని కలెక్టర్ లక్ష్మీశ, జీఎస్‌టీ జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్ కుమార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని, జీఎస్‌టీ సంస్కరణలతో ఎంఎస్‌ఎంఈలు కూడా క్రీడాపరికరాల తయారీ విభాగంలో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందన్నారు. ఈ సంస్కరణల వలన ఆనందం, ఆరోగ్యం, రెండింటికి ఆర్థిక మద్దతు లభిస్తోందని, దేశీయ తయారీదారులకు ప్రోత్సాహం లభిస్తోందన్నారు. జీఎస్‌టీ జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ సూపర్ జీఎస్‌టీ-సూపర్ సేవింగ్స్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, క్రికెట్ బ్యాట్‌లు, బాల్స్, క్రీడా దుస్తులు, బ్యాడ్మింటన్ రాకెట్, బ్యాటరీ రహిత బొమ్మలు తదితరాలపై జీఎస్టీ తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీవో ఎస్ఈ అజీజ్, జిల్లా యువజన సంక్షేమ అధికారి యు.శ్రీనివాసరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వసతి గృహాల తనిఖీ

గుణదల: వసతిగృహ సిబ్బంది అంకితభావంతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. గుణదల గంగిరెద్దుల దిబ్బ వద్ద గల సాంఘిక సంక్షేమశాఖ బాలురు, బాలికల వసతి గృహాలను కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం ఉదయం ఆకస్మిక తనిఖీ చే శారు. ముందుగా పరిసరాల పరిశుభ్రత, వంటశాల పరిశుభ్రతను పరిశీలించారు. సిబ్బంది హాజరు, విద్యార్థినీ విద్యార్థుల హాజరు పరిశీలించారు. వంటశాలలో ఉన్న పప్పుధాన్యాలను పరిశీలించి బాలబాలికలతో కలిసి ఉదయం అల్పాహారం తీసుకున్నారు. అల్పాహారం రుచికరంగానే ఉందని సంతృప్తిని వ్యక్తం చేశారు.

పలువురి రూమ్స్‌కు వెళ్లి అక్కడ వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. మంచి ఉత్తీర్ణత సాధించాలంటే విడి విడిగా చదువుకోవడంతోపాటు వసతిగృహం సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వసతిగృహం వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దత్తపీఠంలో లక్ష్మీకుబేర వ్రతం రేపు

భారతీనగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పటమట శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ ఆశ్రమంలో ఆదివారం ఉదయం 9గంటలకు శ్రీలక్ష్మీకుబేర వ్రతం నిర్వహించనున్నట్లు జయలక్ష్మి మాతృమండలి నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్రతంలో పాల్గొనేవారు ముందుగా పటమటలోని శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ ఆశ్రమానికి వచ్చి పేరు నమోదుచేసుకోవాలని తెలిపారు.

రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

రూట్ హెల్త్ ఫౌండేషన్, ఒమేగా అను హాస్పటల్(తాడిగడప) సంయుక్త ఆధ్వర్యంలో అశోక్‌నగర్‌లోని వెలగపూడి కోల్డ్ స్టోరేజ్ ఆవరణలో రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు రూట్స్ హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ విజయభాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

దోమల నివారణపై ప్రజలకు అవగాహన



మాచవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తూర్పు పరిధి దేవినేని గాంధీపురం, శాంతినగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని వీఎంసీ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా బయాలజిస్ట్ కామేశ్వరరావు మాట్లాడుతూ దోమల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్త పడాలని, నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిల్వ ఉన్న నీటిలో దోమల లార్వాలను బృందం పరిశీలించింది. మలేరియా సిబ్బంది, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి సీఎం ప్రాధాన్యత

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్


లబ్ధిదారులతో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు

గుణదల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజక వర్గంలో ఇప్పటి వరకు రూ.6 కోట్లు విడుదల చేయడం చూస్తే రాష్ట్రంలో పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం చంద్రబాబు ఎంతటి ప్రాధాన్యత ఇస్తున్నారో అర్థం అవుతుందని, ఇది పేదల పట్ల ఆయనకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. శుక్రవారం 2వ డివిజన్ గుణదలలో నిర్వహించిన కార్యక్రమంలో 30 మంది లబ్ధిదారులకు ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ33,35,594ల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి మరింత మేలు కలిగేలా త్వరలో ప్రతి ఒక్కరికి రెండున్న లక్షల నుంచి రూ.25లక్షల వర కు బీమా కల్పించేలా కొత్త పథకానికి చంద్రబాబు శ్రీకారం చుట్టనున్నారని చెప్పారు. జీఎస్‌టీ సంస్కరణల వల్ల ప్రజలకు కలిగిన లాభాలను వివరించారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, జనసేన నాయకుడు ముత్యాల కృష్ణ, టీడీపీ డివిజన్ అధ్యక్షుడు దాసరిగాబ్రియేల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 8వ డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, సుగసాని కృష్ణప్రసాద్, గుత్తికొండ కృష్ణమోహన్, పాల్గొన్నారు.

లయోలాలో రక్త పరీక్ష శిబిరం


రక్త పరీక్ష చేయించుకుంటున్న విద్యార్థినులు

భారతీనగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా లయోలా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్లు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కళాశాలలో మొదటి సంవత్సరం అండర్ గ్రాడ్యుయేట్ చదువుతున్న విద్యార్థులకు రక్త గ్రూపు పరీక్ష శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. సుమారు 657మంది విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఫాదర్ ఎ.ఏంజెలో విద్యార్థులకు వివిధ రక్త గ్రూపులు, వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ శిబిరం శనివారం కూడా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు డాక్టర్ వెలగా జోషి, చిట్టిబాబు, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చాప్టర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మదన్ మోహన్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మెల్చియర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శివకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన


బుక్‌లెట్ విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య, బాలభవన్ ప్రతినిధులు

మొగల్రాజపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య ఆధ్వర్యంలో శుక్రవారం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ జి. శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తుపదార్థాలు, ధూమపానం, మద్యపానం అలవాట్ల వల్ల నియంత్రణ కోల్పోతారని, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధుల బారిన పడతారని హెచ్చరించారు. టీచర్ ఎం. ప్రసన్న మాట్లాడుతూ ఎవరైనా మిమ్మల్ని ప్రలోభపెడితే ఆ సమాచారాన్ని తమకు అందచేయాలని సూచించారు. అనంతరం మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలను, మంచిజీవితం తెలుపుతూ ముద్రించిన బుక్‌లెట్‌లను ప్రిన్సిపాల్, బాలభవన్ ప్రతినిధులు విడుదల చేశారు.

ఉడ్‌పేటలో తాగునీటి కనెక్షన్ల వివాదం

● వీఎంసీకి ఫిర్యాదుల వెల్లువ ● విచారణకు ఆదేశాలు

మొగల్రాజపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గం ఏడో డివిజన్ ఉడ్‌పేటలో మంచినీటి పంపుల కనెక్షన్లు ఇచ్చే అంశంలో వీఎంసీ అధికారులకు ఫిర్యాదులు రావడంతో విచారణకు ఆదేశించారు. ఉడ్‌పేటలో అంబేద్కర్, సుదర్శన్, గంగమ్మ వీధి తదితర ప్రాంతాల్లో ఇటీవల సిమెంట్ రోడ్డు వేశారు. రోడ్డు పూర్తయిన తరువాత స్థానికుల నుంచి కాంట్రాక్టర్ డబ్బులు వసూలు చేసి తాగునీటి పంపుల కనెక్షన్లు ఇచ్చాడు. డబ్బులు ఇవ్వని వారికి కనెక్షన్లు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నాడు. ఇదే అంశంపై స్థానికులు వీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. విషయం తెలిసిన కాంట్రాక్టర్ కనెక్షన్లు ఇచ్చిన వారిలో కొందరికి డబ్బులు తిరిగి ఇచ్చాడు. ఫిర్యాదు చేసిన వారికి మాత్రం కనెక్షన్లు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నాడు. ఈ విషయమై ఈఈ సామ్రాజ్యంను వివరణ కోరగా ఫిర్యాదు వచ్చిన మాట వాస్తవమేనని, విచారణ చేసి నివేదికను కమిషనర్‌కు ఇస్తామని చెప్పారు. నిబంధనల మేరకు కనెక్షన్లు ఇవ్వాలని కాంట్రాక్టర్‌కు సూచిస్తామని చెప్పారు. కమిషనర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.


డివైడర్‌పై చెత్త, తగులబెట్టిన వ్యర్థాలు

ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులో

చెత్త, వ్యర్థాలతో డివైడర్లు

ఆటోనగర్, ఆంధ్రజ్యోతి: జవహర్ ఆటోనగర్‌కు ప్రధాన రహదారి వంద అడుగుల రోడ్డు డివైడర్లు అపారిశుధ్యానికి కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పలు కార్ఖానాలు, దుకాణాదారులు తమ వద్ద తయారైన చెత్తాచెదారం, వ్యర్థాలను రోడ్డు పక్కన పడేస్తున్నారు. మరి కొందరు తమ కార్ఖానాల్లో వచ్చిన రసాయన వ్యర్థాలను డివైడర్‌పై వేసి దహనం చేస్తున్నారు. అద్దం గ్లాస్‌లు, పనికిరాని ప్లాస్టిక్ వస్తువులను డివైడర్ పైనే వేస్తుండటంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

మైకుల ద్వారా ప్రచారం చేయాలి

దుకాణాలు, కార్ఖానాల్లో తయారైన చెత్త, వ్యర్థాలు రోడ్డు డివైడర్‌పై వేయరాదని ఐలా సర్వీస్ సొసైటీ అధికారులు మైకుల ద్వారా ఆటోనగర్‌లో ప్రచారం చేయించాలని పలువురు స్థానికులు కోరుతున్నారు. డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా డివైడర్‌లపై చెత్తా, వ్యర్థాలు, పనికిరాని రసాయనాలను వేస్తే అపరాధ రుసుం వసూలు చేయాలని కోరుతున్నారు.

సన్నాపు సత్యనారాయణకు సన్మానం రేపు

విజయవాడ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర చిత్ర రచయితల ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 19న సాయంత్రం సినీ గేయరచయిత సన్నాపు సత్యనారాయణకు సత్కారం నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు తెలిపారు. విజయవాడ బుక్ ఫైనాన్స్ స్వాతి భవన్ (4వ అంతస్తు) వేదికగా చిత్రకారులు, సంగీతకారులు, సాహితీవేత్తలు, కళాభిమానులు, పూర్వ రచయితలు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.



డిప్యూటీ కలెక్టర్ పదోన్నతి పొందిన మచిలీపట్నం సౌత్ తహసీల్దార్ మధుసూదనరావును అభినందిస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది

ఐదుగురు తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్ పదోన్నతి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ఐదుగురు తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మచిలీపట్నం సౌత్ తహసీల్దార్ పి.మధుసూదనరావు, అవనిగడ్డ తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, పెనమలూరు తహసీల్దార్ కలగర గోపాలకృష్ణ, విజయవాడ వెస్ట్ తహసీల్దార్ ఇంతియాజ్ పాషా, విజయవాడ నార్త్ తహసీల్దార్ మన్నె సూర్యారావులకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు కల్పించారు. పదోన్నతి పొందిన మచిలీపట్నం సౌత్ తహసీల్దార్ మధుసూదనరావుకు శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ పి.కల్పన, ఆర్ఐ జి. శ్యామ్‌కుమార్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఎం.శారద, జూనియర్ అసిస్టెంట్ సిహెచ్. దినకర్, వీఆర్వోల సంఘం అధ్యక్షుడు కె.బి.ఎస్.నాగబాబు, వీఆర్ఏల సంఘం ప్రతినిధి సిహెచ్. సత్యనారాయణ అభినందనలు తెలిపారు.

జనసేన బలోపేతమే లక్ష్యం : సామినేని



కార్యకర్తలతో కలిసి కేక్ కట్‌చేస్తున్న సామినేని ఉదయభాను

విద్యాధరపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లాలో జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, నాయకుడు పని చేయాలని జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు సామినేని ఉదయభాను అన్నారు. జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడుగా ఉదయభాను పదవి చేపట్టి ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా శుక్రవారం భవానీపురంలోని పార్టీ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడ్డవారికే పదవులు లభిస్తాయని చెప్పారు. దుర్గగుడి పాలకమండలి సభ్యురాలుగా జిల్లాకు చెందిన పద్మావతి ఠాకూర్, టి. రమాదేవిలకు అవకాశం లభించినట్లు చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో పార్టీ సమీక్షా సమావేశాలు నిర్వహించి గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్పొరేటర్లు మహదేవ్ అప్పాజీరావు, మరుపిళ్ల రాజేష్, పార్టీ నాయకులు పోతిరెడ్డి అనిత, ఎం.రాజేష్, అత్తులూరి పెద్దబాబు, తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో గురుకుల విద్యార్థి మృతి

మోపిదేవి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మోపిదేవి బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న ఆరేవరపు భార్గవ్(17) మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కోడూరు మండలం ఊటగుండం గ్రామానికి చెందిన ఆరేవరపు వెంకటేశ్వరరావు కుమారుడు భార్గవ్ బీసీ బాలుర గురుకుల పాఠశాలలో చదువుతున్నాడు. ఈనెల 14న జలుబుగా ఉండటంతో పాఠశాలలోని స్టాఫ్ నర్సు వద్ద ట్యాబ్లెట్లు తీసుకున్నాడు. 15న సాయంత్రం స్టాఫ్ నర్సు ద్వారా విద్యార్థి ఆరోగ్యంపై ప్రిన్సిపాల్ వీర రవి, ఆరా తీశారు. ఆయాసం, దగ్గు, జలుబు ఉన్నాయని చెప్పడంతో వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. తల్లిదండ్రులు విద్యార్థిని అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారని, మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడని తెలిపారు. ఉపాధ్యాయులు ఊటగుండం వెళ్లి విద్యార్థి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

జస్టిస్ గవాయ్‌పై దాడి సంఘటనపై సమగ్ర విచారణ జరపాలి

- ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణ డిమాండ్
- పేటలో ఆత్మగౌరవ నిరసన ర్యాలీ



ఆత్మగౌరవ నిరసన ర్యాలీలో పాల్గొని, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మంద కృష్ణ

జగ్గయ్యపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ దాడి న్యాయ వ్యవస్థపైనే కాకుండా దళితులపై దాడిగా భావించాల్సి వస్తుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ పేర్కొన్నారు. జగ్గయ్యపేటలో ఎంఎస్పీ అనుబంధ సంఘాలు శుక్రవారం నిర్వహించిన ఆత్మగౌరవ నిరసన ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత మంద కృష్ణ ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జస్టిస్ గవాయ్‌పై దాడి సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి కారణమైన వ్యక్తిని, అతని వెనుక ఉన్న శక్తులను తేల్చకుండా వ్యవస్థలు ఉదాసీనంగా వ్యవహరించడం అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. ఈ అనాగరిక చర్యలపై ఎంఎస్పీ ఉన్న దక్షిణాది రాష్ట్రాలలో ఆందోళనలు జరుగుతున్నాయని, త్వరలో చలో హైదరాబాద్, చలో అమరావతి, చలో చెన్నై తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దాడి సంఘటనపై సమగ్ర విచారణ జరిపే వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. సీనియర్ నేతలు గోపీ, అన్నె పాగ కాంతారావు, ఎం.దావీదు, మల్లెల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

- ఏఐ ఆధారిత సీసీ కెమెరాల ఏర్పాటుకు జాతీయ రహదారుల అధికారులకు ఆదేశం
- డ్రైవర్‌ను అప్రమత్తం చేసే ప్రత్యేక పరికరం రూపొందించిన ధనేకుల విద్యార్థులు



రహదారి భద్రతా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.

రహదారి భద్రతా కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. రోడ్డు ప్రమాదాల స్థితిగతులు, బ్లాక్ స్పాట్ నివారణకు తీసుకున్న చర్యలు, డ్రంక్ అండ్ డ్రైవ్, హిట్ అండ్ రన్ మోటార్ యాక్సిడెంట్ కేసులు, ప్రమాదాల నివారణకు సాంకేతిక పరిజ్ఞాన వినియోగం తదితర అంశాలపై ఆయన అధికారులతో చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారి నెంబర్. 65, జాతీయ రహదారి నెం.216లపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. బ్లాక్ స్పాట్లను గుర్తించి సమస్యలను పరిష్కరించాలని, అవసరమైన చోట్ల ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఏఐ ఆధారిత సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎన్నిమార్లు చెప్పినా అమర్చకపోవటం పట్ల ఆయన జాతీయ రహదారుల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఇది సరైనది కాదన్నారు.

డ్రైవర్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపినా, మగతతో వాహనం నడిపినా అప్రమత్తం చేసే ప్రత్యేక పరికరం పనితీరుపై గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు డెమో ద్వారా వివరించారు. విద్యార్థులను కలెక్టర్ అభినందించి, అవసరానికి తగిన విధంగా మరింతగా అభివృద్ధి చేసి పరికరాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కళాశాల అధ్యాపకుడు డాక్టర్ సురేంద్రకు సూచించారు. వాహనాల్లో ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించే విధంగా ఉన్నతాధికారులతో మాట్లాడి పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జిల్లా ప్రజారవాణా అధికారికి సూచించారు. ఈ సంవత్సరం సెప్టెంబరులో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మొత్తం 63 రోడ్డు ప్రమాదాలు సంభవించగా, వాటిలో 32 మృతి చెందగా 47 మంది గాయాలపాలయ్యారని, అత్యధికంగా జాతీయ రహదారులపై 20, రాష్ట్ర రహదారులపై ఐదు, ఇతర రహదారులపై ఏడు మరణాలు సంభవించినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. వీటిలో అత్యధికంగా ద్విచక్ర వాహనాల వల్ల 12 మరణాలు, కార్లు, వ్యాన్లు, జీపుల వల్ల 10, లారీలు 5, ట్రాక్టర్ల వల్ల మూడు మరణాలు సంభవించినట్లు తెలిపారు.

సమావేశంలో అదనపు ఎస్పీ వి.వి.నాయుడు, జిల్లా రవాణా అధికారి ఎస్‌యుఎస్ఎస్.శ్రీనివాస్, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, ఆర్ అండ్ బి ఈఈ లోకేశ్వరరావు, సమగ్ర శిక్ష అదనపు పీడీ ఆర్.కుముదిని సింగ్, డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ వెంకట్రావ్, జిల్లా ప్రజా రవాణా అధికారి వెంకటేశ్వర్లు, జాతీయ, రాష్ట్ర రహదారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి, సాధికారత లక్ష్యంగా రాజధాని ప్రాంత మహిళలకు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ శిక్షణ

కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాజధాని ప్రాంత మహిళల స్వయం ఉపాధి, సాధికారత లక్ష్యంగా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ శిక్షణను యర్రబాలెం ప్రారంభించారు. గైడ్ ఫౌండేషన్ ఫర్ డెవలప్‌మెంట్ సంస్థ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, యాక్సెంచర్ సంయుక్త ఆధ్వర్యంలో వ్యాపార నిర్వహణకు అవసరమైన సాంకేతిక, ఆచరణాత్మక నైపుణ్యాలపై శిక్షణ ఇస్తారు. మందడం, అనంతవరం ఉండవల్లి, యర్రబాలెం గ్రామాల్లో 26 రోజులపాటు బిస్కెట్లు, స్నాక్స్, సంప్రదాయ స్వీట్స్, మిల్లెట్ ఆధారిత పోషకాహార ఉత్పత్తుల తయారీపై శిక్షణ అందిస్తారు. శిక్షణ పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తారు. గైడ్ ఫౌండేషన్ ఈడీ మురళీకృష్ణ, ఎడ్మండ్ భూపతి, డాక్టర్ మాధవీలత, రుబీబిందర్ కౌర్, మాస్టర్ ట్రైనర్ సురేంద్రకుమార్, సీఆర్‌డీఏ లైవ్‌లీహుడ్ స్పెషలిస్ట్ ఎస్.వి.నరసింహం పాల్గొన్నారు. పూర్తి వివరాల కోసం కింది ఎస్.వి.నరసింహం, లైవ్‌లీహుడ్ స్పెషలిస్ట్, ఏపీ సీఆర్‌డీఏ, 9550311637, రుబీందర్ కౌర్, ప్రాజెక్టు మేనేజర్, జీఎఫ్ఎఫ్‌డీ, 9618374402లను సంప్రదించవచ్చు.



ఎఫ్‌డీసీ ఎండీ కె.ఎస్.విశ్వనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మేనేజర్లు

మర్యాదపూర్వక కలయిక

కృష్ణలంక, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర చలన చిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డీసీ) మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులైన కె.ఎస్.విశ్వనాథన్‌ను ఎఫ్‌డీసీ మేనేజర్లు ఎం.శ్రీనివాస నాయక్, చల్ల శ్రీనివాసులు, సిబ్బంది బి.ప్రదీప్ కుమార్, ఎం.కోటేశ్వరరావు శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

525 మంది యువ న్యాయవాదులు హైకోర్టు బార్‌లో ఎన్‌రోల్ నేడు

విజయవాడ లీగల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఏపీ హైకోర్టు బార్ కౌన్సిల్‌లో యువ న్యాయవాదులు 525 మంది శనివారం ఎన్‌రోల్ కానున్నారు. హైకోర్టు బార్ కౌన్సిల్ ఎదుట రెండు బ్యాచ్‌లుగా యువ న్యాయవాదులు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఒకేరోజు ఇంత పెద్దసంఖ్యలో యువ న్యాయవాదులు బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ కావడం ఇదే మొదటిసారి.

జిల్లా స్థాయి యువజనోత్సవాలు 28న


మచిలీపట్నం టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో యువతీ యువకుల కళా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఈనెల 28న గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన సంక్షేమ శాఖాధికారి యు.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 28 ఏళ్ల మధ్య వయసు యువతీ యువకులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఫోక్ సాంగ్స్, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, డిక్లమేషన్, పొయట్రీ, సైన్స్ ఇన్నోవేషన్‌లో పోటీలు నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు 27లోగా పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు.

మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు పొడిగింపు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష దరఖాస్తుకు గడువును ఈనెల 25 వరకు పొడిగించినట్టు డీఈవో పి.వి.జె. రామారావు తెలిపారు. అభ్యర్థులు 25లోగా దరఖాస్తు చేసుకుని 27లోగా పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు.

చిత్రజ్యోతి
SINCE 1965

పంచాయతీ సెక్రటరీ



వింటేజ్ కపుల్ శివాజీ, లయ మరోసారి కలిసి నటిస్తున్న చిత్రం నిర్మాణదశలో ఉంది. ఈటీవీ విన్‌తో కలిసి శివాజీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయన పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్‌గా నటిస్తున్నారు. దీపావళి పండగ సందర్భంగా ఈ చిత్రం నుంచి శివాజీ లుక్ విడుదల చేశారు. తన కుటుంబంతో కలిసి దీపావళి పండగ సెలబ్రేట్ చేసుకోవడానికి పటాసులు తీసుకెళుతున్న లుక్ అది. అన్యాయాన్ని సహించని వ్యక్తిగా, నిజాయతీపరుడిగా శివాజీ ఇందులో నటిస్తున్నారు. భార్యాబిడ్డలే అతని ప్రపంచం, వాళ్ల కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడని వ్యక్తి పాత్రలో శివాజీ అభినయం ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు సుధీర్ శ్రీరామ్ చెప్పారు. చిత్రం టైటిల్, ఇతర విశేషాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. అలీ, ధనరాజ్, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

వంద శాతం హిట్ కొడతాం

సుధీర్ బాబు



సుధీర్ బాబు ప్రధాన పాత్రధారునిగా దర్శక ద్వయం వెంకటేశ్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'జటాధర'. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. తాజాగా ప్రిన్స్ మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో భూత పిశాచాలు, శాపగ్రస్త ఆలయాలు, ఆధ్యాత్మిక యుద్ధాలను కళ్లు తిప్పుకోలేని విధంగా చూపించారు. సుధీర్ బాబు నేలపై ఉన్న రక్తం తాగుతూ తపస్సులోకి వెళ్లే సన్నివేశం ఒళ్లు జలదరింపజేస్తుంది. భయానక సన్నివేశాలతో పాటు భారతీయ పురాణ వైభవాన్ని కూడా అద్భుతంగా తెరకెక్కించారు. అనంతరం నిర్వహించిన వేడుకలో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. అంతకు మించిన భావోద్వేగాలుంటాయి. ధన పిశాచి పాత్రలో సోనాక్షి సిన్హా అదరగొట్టారు. ప్రేక్షకుల డబ్బులకు విలువ ఇచ్చినప్పుడు సినిమా వంద శాతం విజయం సాధిస్తుంది. 'జటాధర' కూడా వంద శాతం హిట్ కొడుతుంది. నవంబరు 7న కుటుంబ సభ్యులందర్నీ సినిమాకు తీసుకెళ్లండి' అని అన్నారు. నటి శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత 'జటాధర'తో తెలుగులో నటించడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

విజయం సాధించాం

సిద్ధు జొన్నలగడ్డ



"తెలుసు కదా' సినిమా చేయాలని అనుకున్నప్పుడు నా మనసులో ఒక భయం ఉండేది. ఆ భయం యాక్టర్‌గా కాదు రైటర్‌గా. ప్రతీ సన్నివేశంలో పంచులు లేకుండా ప్రేక్షకుల్ని మెప్పించగలమా అనే సందేహం ఉండేది. ఈ రోజు ఆ భయం పోయింది. థియేటర్ల ఎదుట హౌస్‌ఫుల్ బోర్డులు చూస్తుంటే మేము విజయం సాధించామనే ఆనందం కలిగింది. సినిమాకు అన్ని చోట్ల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర దర్శకురాలు నీరజ కోన మాట్లాడుతూ 'సినిమాకు వస్తున్న స్పందనను చూస్తుంటే చాలా ఎమోషనల్‌గా ఉంది. చిత్ర కథలో మేము కనెక్ట్ అయిన పాయింట్‌తో ప్రేక్షకులు కూడా అంతే అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. మా నిర్మాతలు విశ్వ గారు, కృతి గారు, హీరో సిద్ధు, హీరోయిన్లు రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి, చిత్ర బృందం మొత్తానికి కృతజ్ఞతలు' అని అన్నారు. నటుడు వైవా హర్ష మాట్లాడుతూ 'మా చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని చెప్పారు.

సందేశాత్మకం



జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. దైవ నరేశ్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'మా సినిమా ప్రచార చిత్రాలకు చక్కని స్పందన వచ్చింది. కథానుసారం తెలంగాణ యాసలో కొన్ని పాత్రలు పలికిన సంభాషణలను కొందరు విమర్శించారు, కానీ సినిమా ఎవరినీ కించపరిచేలా ఉండదు. సందేశాత్మకంగా ఉంటుంది' అని చెప్పారు. త్వరలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు తెలిపారు.



అనుబంధాలను ఆవిష్కరించే చిత్రం

'నేను నటించే సినిమాలు చాలా బావుంటాయి అనే ఇమేజ్‌ను ప్రేక్షకుల దగ్గర తెచ్చుకోవాలనేదే నా ప్రయత్నం. అది 'కె-ర్యాంప్' చిత్రంతో పూర్తిగా నెరవేరుతుందనే నమ్మకం ఉంది. కుటుంబ అనుబంధాలను తెరపై గొప్పగా ఆవిష్కరించే చిత్రమిది' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వం వహించిన చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. జైన్స్ నాని మాట్లాడుతూ 'మా సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే ప్రచార చిత్రాలతో మంచి ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమాలో డైలాగ్స్ ప్రేక్షకులకు బాగా నచ్చాయి. వాటిని ప్రేక్షకులు చెబుతుంటే చాలా సంతోషంగా అనిపించింది. ప్రథమార్థంలో ప్రేమకథా, ద్వితీయార్థంలో కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.

దుర్గగుడిలో అన్నదాన పథకానికి విరాళాలు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో జరుగుతున్న అన్నదాన పథకానికి పలువురు దాతలు శుక్రవారం విరాళాలు అందచేశారు. ఈ సందర్భంగా దాతలకు అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేసి, అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందించారు. విజయవాడ కామకోటినగర్‌కు చెందిన వరద కిషోర్ కుమార్ కుటుంబ సభ్యులు రూ.1,00,116లు, విజయవాడ ఆర్టీసీ కాలనీకి చెందిన జి.అశోక్ ప్రసాద్ కుటుంబసభ్యులు రూ.1,01,116లు అందజేశారు.


చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, ఎలక్ట్రికల్ ట్రై సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో పీ-4 ద్వారా తోపుడు బండ్ల పంపిణీ శుక్రవారం జరిగింది. విభిన్న ప్రతిభావంతులకు ఎలక్ట్రికల్ ట్రై సైకిల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు, బలహీన కుటుంబాలను బంగారు కుటుంబాలుగా మార్చి రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించాలనే కృత నిశ్చయంతో ప్రభుత్వం ఉందన్నారు. కార్యక్రమంలో నేతలు ఘంటా కృష్ణమోహన్, నవనీతం సాంబశివరావు, బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఎల్‌వోసీల అందజేత

విద్యాధరపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): భవానీపురంలోని ఎన్డీఏ కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు ఎల్‌వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రాలను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్, తదితరులు అందజేశారు. 38వ డివిజన్‌కు చెందిన అండిమాని శంకర్‌నాగ్(46) హృద్రోగంతో బాధపడుతున్న అతనికి రూ.5 లక్షల మంజూరయ్యాయి. సరిపల్లి రాధకృష్ణ, అబ్దుల్ తారిక్, బి.కనకారావు, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీతో క్రీడారంగానికి కొత్త వెలుగులు

అవగాహన ర్యాలీలో కలెక్టర్ లక్ష్మీశ

లబ్బీపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 సంస్కరణలతో క్రీడా రంగానికి కొత్త వెలుగులు వచ్చాయని, ఈ రంగానికి మరింత ఊపు వచ్చేలా క్రీడా సామగ్రి, ఆట బొమ్మలు మరింత చౌకగా లభ్యమవుతున్నాయని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమాల్లో భాగంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కలెక్టర్ లక్ష్మీశ, జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్ కుమార్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు శారీరకతో పాటు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని, జీఎస్టీ సంస్కరణలతో ఎంఎస్ఎంఈలు కూడా క్రీడాపరికరాల తయారీ విభాగంలో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందన్నారు. ఈ సంస్కరణల వలన ఆనందం, ఆరోగ్యం, రెండింటికి ఆర్థిక మద్దతు లభిస్తోందని, దేశీయ తయారీదారులకు ప్రోత్సాహం లభిస్తోందన్నారు. జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. క్రికెట్ బ్యాట్‌లు, బాల్స్, క్రీడా దుస్తులు, బ్యాడ్మింటన్ రాకెట్, బ్యాటరీ రహిత బొమ్మలు తదితరాలపై జీఎస్టీ తగ్గిందన్నారు. డీఎస్‌డీవో ఎస్ఈ అజీజ్, జిల్లా యువజన సంక్షేమ అధికారి యు.శ్రీనివాసరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.


ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, జీఎస్టీ జాయింట్ కమిషనర్ ప్రశాంత్ కుమార్ తదితరులు

రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులతో అధికారుల ముఖాముఖి

రైల్వేస్టేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల అభిప్రాయాలను తెలుసుకునే 5.0లో భాగంగా అమృత సంవాద్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్లాట్‌ఫారం-1 మీద జరిగిన కార్యక్రమంలో అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ (ఆపరేషన్స్) శ్రీనివాసరావు కొండా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రయాణికులతో ముఖాముఖి నిర్వహించారు. ప్రయాణికులు అడిగిన అనేక ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. రైల్వే స్టేషన్‌లో సౌకర్యాలు, రైళ్ల సర్వీసుల గురించి పలు అంశాలను వివరించారు. మహిళా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బందిని అధికంగా నియమించాలని కోరారు. ప్రయాణికుల ఆశయాలకు అనుగుణంగా రైల్వేల ఆధునీకరణకు ప్రయత్నం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అమృత స్టేషన్ల అభివృద్ధి గురించి షార్ట్‌ఫిల్మ్‌ను ప్రదర్శించారు. ప్రయాణికుల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని రైళ్లలో, రైల్వే స్టేషన్లలో మెరుగైన సౌకర్యాల కల్పనకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. సీనియర్ డివిజనల్ మేనేజర్ (పర్యావరణం, హౌస్ కీపింగ్ మేనేజ్‌మెంట్) ఎం.వంశీకాంత్, పీఆర్వో నుస్రత్ ఎం.మండ్రూపకర్, స్టేషన్ డైరెక్టర్ శైలజ, తదితరులు పాల్గొన్నారు.


ప్రయాణికులతో మాట్లాడుతున్న అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ శ్రీనివాసరావు


పద్మావతి ఠాకూర్‌తో ప్రమాణం చేయిస్తున్న ఈవో శీనానాయక్

దుర్గగుడిలో సభ్యురాలి ప్రమాణ స్వీకారం

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానం మహామండపంలోని ఈవో వి.కె.శీనానాయక్ కార్యాలయంలో శుక్రవారం దేవస్థానం ధర్మకర్తల పాలకమండలి సభ్యురాలుగా నియమితులైన పద్మావతి ఠాకూర్ ప్రమాణస్వీకారం చేశారు. ఈవో ఆమెతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

డ్రగ్స్ భూతం.. సమష్టిగా అంతం చేద్దాం

మహిళా సంస్థల ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ స్టేడియం వద్ద నిరసన

గవర్నర్‌పేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): డబ్బు సంపాదనే లక్ష్యంగా డ్రగ్స్ మాఫియా యువత భవితను ఛిద్రం చేస్తుందని ఎంబీవీకే బాధ్యులు కె. స్వరూపరాణి అన్నారు. మాదక ద్రవ్యాల నుంచి యువత బయటకు రావాలని కోరుతూ నగరంలోని 11మహిళా సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాగాంధీ స్టేడియం సమీపంలో డ్రగ్స్ భూతం దిష్టిబొమ్మను దహనం చేశారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలు నిషేధం, పర్యావరణ పరిరక్షణ, లింగ వివక్ష తదితర అంశాలపై ప్లకార్డులు ప్రదర్శించారు. స్వరూపరాణి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా యువత పోరాటం చేయాలని కోరారు. రచయిత్రి వేమూరి సత్యవతి మాట్లాడుతూ మెట్రోపాలిటన్ సిటీలకే పరిమితమైన డ్రగ్స్ వ్యాపారం గ్రామాలు, పట్టణాలు, యూనివర్సిటీలు, కాలేజీలు, చివరకు స్కూల్స్‌కు కూడా వ్యాప్తి చెందుతున్నాయన్నారు. డ్రగ్స్ భూతం అంతం చేయడంలో సమష్టిగా వ్యవహరించాలని కోరారు. ఈ సందర్భంగా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నలంద కళాశాల విద్యార్థులు వేసిన వీధి నాటిక అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పి.విజయ, కె.గీత, సేఫ్ సంస్థ ప్రతినిధి ఎస్.అనీష్, ఉషా రాజా, ఎ.సంధ్యరాణి, స్వాతిపూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.


డ్రగ్స్ భూతం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మహిళా సంఘాలు

విశిష్ట గుర్తింపు సంఖ్య

స్వాగతిస్తున్నామన్న కౌలు రైతు సంఘం

విద్యాధరపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు కౌలు రైతుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.కాటమయ్య, పి.జమలయ్య అన్నారు. భూ యజమాని ప్రమేయం లేకుండా కౌలు రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యను జారీ చేయాలని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో వెబ్‌ల్యాండ్‌లో నమోదైన భూమి ఆధారంగా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసే విషయంలో ప్రభుత్వం సమగ్రంగా కృషి చేయలేదన్నారు. పంటలు పండిస్తున్న కౌలు రైతులను నిర్లక్ష్యం చేసి భూయజమానులు సూచించిన వారికే కౌలు గుర్తింపు కార్డులు జారీ చేశారని విమర్శించారు. విశిష్ట గుర్తింపు సంఖ్యను జారీచేసి అన్నదాత సుఖీభవ, పంట రుణాలు, ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్స్ సబ్సిడీ అందించాలి కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

నార్త్ ఏసీపీ స్రవంతీరాయ్

సత్యనారాయణపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని నార్త్ ఏసీపీ స్రవంతీరాయ్ అన్నారు. సత్యనారాయణపురం పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం ఏలూరు లాకుల వద్ద సీఐ లక్ష్మీనారాయణతో కలిసి తనిఖీలు చేశారు. ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ ధరించాలన్నారు. కారు నడిపేటప్పుడు సీటు బెల్ట్‌ను ధరించడం అలవాటుగా చేసుకోవాలన్నారు. ఈ రెండిటిని పాటిస్తే ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం నుంచి తప్పించుకునే అవకాశం 90శాతం పెరుగుతుందన్నారు. నిబంధనలు అతిక్రమించి వారికి జరిమానాలు విధించారు. కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.


ఏలూరు లాకుల వద్ద సీఐతో మాట్లాడుతున్న ఏసీపీ

యువతితో అసభ్య ప్రవర్తన

ముగ్గురు యువకులపై కేసు నమోదు

పాయకాపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : యువతితో పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ముగ్గురు యువకులపై నున్న రూరల్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. యువతి(19) నగరంలోని ఓ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతుంది. అదేకళాశాలలో చదువుతున్న తనూష్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. పరచయాన్ని అడ్డం పెట్టుకుని తనూష్ ఆమెతో దిగిన వీడియోలను తన ఇద్దరు స్నేహితులైన శ్రీకాంత్‌రెడ్డి, సంతోష్‌లకు పంపించాడు. ఇద్దరు స్నేహితుల ద్వారా మరి కొంత మందికి వీడియోలు వాట్సప్ ద్వారా వెళ్లడం తెలుసుకున్న యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

అజిత్‌సింగ్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : ఉరివేసుకుని ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. దూపాటి మేఘన(31) వాంబేకాలనీ ఎఫ్ బ్లాక్ ప్రాంతంలో నివాసం ఉంటుంది. భర్తతో తలెత్తిన మనస్పర్థల కారణంగా ఐదు నెలలుగా విడిగా ఉంటుంది. మనస్తాపానికి గరైన మహిళ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని మృతి చెందింది. సమాచారం అందుకున్న అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూతురు కనిపించటంలేదని ఫిర్యాదు

విద్యాధరపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కాలేజీకి వెళుతున్నానని తల్లిదండ్రులకు చెప్పి ఇంటిలో నుంచి బయటకు వెళ్లిన విద్యార్థిని తిరిగి ఇంటికి రాకపోవటంతో పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. విద్యార్థి(19) ప్రవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బి.టెక్ రెండో సంవత్సరం చదువుతుంది. కొన్ని రోజులుగా ఆమె నివాసం వద్ద ఉంటున్న సాధిక్ అనే యువకుడు ఆమె వెంట పడి వేధిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సాధిక్‌ను పెద్దల సమక్షంలో మందలించారు. శుక్రవారం ఉదయం కాలేజీకి వెళుతున్నానని తల్లిదండ్రులకు చెప్పి వెళ్లి, ఇంటికి రాకపోవటంతో బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కుందావారి కండ్రిక పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా శ్రీనాథ్

విద్యాధరపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ నియోజకవర్గం పరిధిలోని కుందావారి కండ్రిక ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ చైర్ పర్సన్‌గా సాదం శ్రీనాథ్, సభ్యులుగా పొన్నం శేషగిరిరావు, దేవిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిలను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పార్టీ కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొని వారిని అభినందించారు.

శ్రీకృష్ణదేవరాయలకు ఘన నివాళి

గాంధీనగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయల వర్థంతి సందర్భంగా కాపునాడు, రాయ లసేన ఆధ్వర్యంలో శుక్రవారం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు గిద్ద శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ రాయల పాలనలో తెలుగు సంస్కృతి, సాహిత్యం, వ్యవసాయ, వాణిజ్య రం గాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. అమరావతిలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని కోరారు. రాయలసేన ఈశ్వర్, అడ్డాల సతీష్‌కమార్, తోట సాంబశివరావు, కునపురెడ్డి రమేష్ అన్నె కుసుమా, లంక రాంబాబు, చలమలశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సన్నాపు సత్యనారాయణకు సన్మానం రేపు

విజయవాడ కల్చరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర చిత్ర రచయితల ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 19న సాయంత్రం సినీ గేయరచయిత సన్నాపు సత్యనారాయణకు సత్కారం నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు తెలిపారు. విజయవాడ బుక్ ఫైనాన్స్ స్వాతి భవన్ (4వ అంతస్తు)వేదికగా చిత్రకారులు, సంగీతకారులు, సాహితీవేత్తలు, కళాభిమానులు, పూర్వ రచయితలు కార్యక్రమానికి హాజరుకానున్నారు.

గూగుల్‌డేటా సెంటర్‌తో సువర్ణాధ్యాయం:శాప్ చైర్మన్

లబ్బీపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విశాఖలో గూగుల్‌డేటా సెంటర్ రావడం రాష్ట్రానికి సువర్ణ అధ్యాయమని శాప్ చైర్మన్ రవినాయుడు తెలిపారు. ఇందిరాగాంధీ స్టేడియంలోని శాప్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మంత్రి లోకేష్ కృషితో రాష్ట్రానికి అనేక పరిశ్రమలు వస్తున్నాయన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.560

జిల్లాస్థాయి పోటీలకు మునుకుళ్ల విద్యార్థుల ఎంపిక

మునుకుళ్ళ(తిరువూరు), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి పోటీలకు మునుకుళ్ల జడ్పీ విద్యార్థులు ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్ఎం రామకృష్ణ శుక్రవారం తెలిపారు. నరసాపురంలో డివిజన్ స్థాయిలో జరిగిన పోటీల్లో అండర్-17 విభాగంలో బి.అఖిల, అండర్-14 విభాగంలో షేక్ షమ ఎంపికయ్యారు. విద్యార్థులను పీడీ వేణి కృష్ణమ్మ, స్కూల్ ఉపాధ్యాయులు అభినందించారు.

సీఎం సాయం పేదలకు వరం

● 50 మందికి రూ.69.41 లక్షల సాయం

గొల్లపూడి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి ఆపదలో ఉన్నవారికి వరం లాంటిదని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. 50 మందికి రూ.69.41 లక్షల విలువగల చెక్కులు అందించారు. శుక్రవారం గొల్లపూడిలోని తన కార్యాలయంలో 23మంది లబ్ధిదారులకు, కూటమి నాయకులు ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో నూతలపాటి వెంకటేశ్వరరావు (నారద), జి.కొండూరు మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేములకొండ వెంకటేశ్వరరావు, లంక నాగేశ్వరరావు (నాని), కొత్తూరు తాడేపల్లి పీఏసీఎస్ చైర్మన్ ధూళిపాళ్ల రమేష్, గరికపాటి శివ, పాల్గొన్నారు.



జి.కొండూరు నేతలకు సీఎం సహాయ నిధి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్


జోగి నోరు అదుపులో పెట్టుకో : టీడీపీ నేతలు

జి.కొండూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కల్తీ మకిలీ ప్రభుత్వానికి అంటించాలని చూసి తాను తీసిన గోతిలో తానే పడిన వైసీపీ నేత, మాజీమంత్రి జోగి రమేష్ నోరు అదుపులో పెట్టుకోకుంటే గుణపాఠం చెబుతామని టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేములకొండ వెంకటేశ్వరరావు, లంక నాగేశ్వరరావు అన్నారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, లోకేష్, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌పై ఇష్టానుసారంగా మాట్లాడటంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అద్దెపల్లి జనార్దన్‌తో జోగికి ఉన్న సంబంధాలతో రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిపోయిందన్నారు. అవినీతి అక్రమాలతో ఎదిగిన జోగి నీతి సూక్తులు వల్లించడం దెయ్యాలు వేదాలు వల్లించిన చందంగా ఉందన్నారు. సమావేశంలో ఉయ్యూరు వెంకట నరసింహారావు, మంగలంపాటి వెంకటేశ్వరరావు, పటాపంచల నరసింహారావు, పజ్జూరు విజయ్, చల్లా ప్రభాకర్, పజ్జూరు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుపై వైసీపీ తప్పుడు ప్రచారం

తోటమూల(గంపలగూడెం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విశాఖలో గూగుల్‌డేటా సెంటర్ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తుంటే వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు అన్నారు. టీడీపీ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ, గూగుల్‌డేటా సెంటర్ ఏర్పాటుపై విమర్శలు చేస్తున్న, కొందరు వైసీపీ నాయకుల పిల్లలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఎక్కడ చేస్తున్నారో, ప్రజలు నిలదీయ్యాలన్నారు. వైసీపీ అవినీతి పునాదులమీద పుట్టిన పార్టీ అని దానికి భవిష్యత్ లేదన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు వీరారెడ్డి, డి.వెంకటకృష్ణారావు, వేముల రాంబాబు, వెంకట్, రాంబాబు, నారాయణ, కోటేశ్వరరావు, కావూరి శ్రీనివాసరావు, వెంకటేశ్వరెడ్డి పాల్గొన్నారు.











వరదల సమయంలో రక్షణపై మాక్ డ్రిల్

గొల్లపూడి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విపత్తులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని విజయవాడ ఆర్డీవో కె.చైతన్య అన్నారు. వరదలు, భవనాలు కూలడం, అగ్ని ప్రమాదాలు వంటి విపత్తు సందర్భాల్లో సురక్షితంగా బయటపడడానికి ఎలాంటి చర్యలు చేపట్టాలో ప్రజలకు తెలిపేందుకు మాక్ డ్రిల్ నిర్వహించారు. గొల్లపూడి ఘాట్ వద్ద నిర్వహించిన మాక్ డ్రిల్‌లో రెవెన్యూ, అగ్నిమాపక, పశుసంవర్ధక, పోలీస్, వైద్య, పంచాయతీరాజ్, మహిళ శిశు సంక్షేమ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలను ప్రజలకు వివరించారు. వరదల సమయంలో నీటిలో మునిగిపోయిన వ్యక్తిని ఎలా రక్షించాలి, సీపీఆర్ ఎలా చేయాలి అనే విషయాలను ప్రజలకు తెలియజేశారు వరదల సమయంలో మనుషులతో పాటు పశువులను రక్షించే విధానాన్ని వివరించారు. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయటం, నిర్వహించడం, పిల్లలకు విద్య అందించడం వంటి అంశాలను కూడా మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుహాసిని, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ హనుమంతరావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఎ.వి.శంకరరావు, విజయవాడ గ్రామీణ తహసీల్దార్ బి.సుగుణ, ఎంపీడీవో విగ్గిన్స్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో చైతన్య, మాక్ డ్రిల్‌లో సీపీఆర్

పంచాయతీ భవన నిర్మాణానికి స్థల వితరణ

రెడ్డిగూడెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపురంలో పంచాయతీ నూతన భవన నిర్మాణానికి రూ.5 లక్షల విలువ చేసే ఏడు సెంట్ల స్థలాన్ని టీడీపీ నాయకుడు, పీఏసీఎస్, పాలకేంద్రాల అధ్యక్షుడు నాదెండ్ల చెన్నకేశవరరావు (కేసిబాబు), శ్రీరాంపురం సర్పంచ్ అట్లూరి శ్రీనివాసరావు సంయుక్తంగా అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. శుక్రవారం పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేసిన స్థలం డాక్యుమెంట్స్‌ను ఎంపీడీవో టి.కె.వి.రమణకు, శ్రీరాంపురం పంచాయతీ కార్యదర్శి రాజేష్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లుగా గ్రామ పంచాయతీకి సొంత భవనం లేక పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు స్థలాన్ని ఇచ్చినట్టు చెప్పారు. దాతలను పలువురు అభినందించారు.



ఎంపీడీవో టి.కె.వి రమణకు స్థలం రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తున్న దాతలు కేసుబాబు, సర్పంచ్ అట్లూరి శ్రీనివాసరావు

బాణసంచా షాపుల ఏర్పాటుకు స్థల పరిశీలన

తిరువూరు : పట్టణంలో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు సంబంధించి అధికారులు స్థలాన్ని పరిశీలించారు. శుక్రవారం ఇన్‌చార్జి తహసీల్దార్ నాగమణి, ఎస్సై సత్యనారాయణ, ఫైర్‌సిబ్బంది, దారా పూర్ణయ్య టౌన్‌షిప్పులో షాపుల ఏర్పాటు స్థలాన్ని పరిశీలించి, షాపుల నిర్వాహకులకు, పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు.

ఈలప్రోలు కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈలప్రోలు సెంటు పట్టా కాలనీలో నివాసులకు సీఎస్‌ఆర్ ఫండ్స్ నుంచి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు అన్నారు. కూటమి నేతలతో కలిసి శుక్రవారం కాలనీని సందర్శించారు. ప్రజలు మౌలిక వసతులు లేక పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. కొండపల్లి మున్సిపాలిటీలో కాలనీ మ్యాపింగ్ కాకపోవడంతో మున్సిపల్ నిధులు వెచ్చించే వీలు లేదని మున్సిపల్ అధికారులు తెలిపారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. అయితే సీఎస్‌ఆర్ ఫండ్స్‌ను వెచ్చించి మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు, కూటమి నాయకులు అక్కల రామ్మోహన్‌రావు (గాంధీ), చెరుకుమల్లి సురేష్ పాల్గొన్నారు.



కాలనీ వాసుల కష్టాలు తెలుసుకుంటున్న కూటమి నేతలు

గవాయ్‌పై దాడికి యత్నించిన వారిని అరెస్టు చేయాలి

ఇబ్రహీంపట్నం / రెడ్డిగూడెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించి వ్యక్తిని తక్షణం అరెస్టు చేయాలని, దాడియత్నం వెనుక ఉన్న కుట్రలు గుర్తించి చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నేతలు శుక్రవారం నిరసన ప్రదర్శన చేశారు. ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు.



ఇబ్రహీంపట్నంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్‌పీ నేతలు

● రెడ్డిగూడెంలో ఎమార్పీఎస్ నేతలు నల్లజెండాలు ధరించి నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం తహసీల్దార్ జె.సుశీలదేవికి ఎమ్మార్పీఎస్ నేతలు వినతిపత్రం అందించారు.



తహసీల్దార్ అబ్దుల్ దరియాకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

● **మైలవరం :** గవాయిపై దాడిని ఖండిస్తూ శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు నల్లజెండాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహసీల్దార్ అబ్దుల్ దరియాకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఇంకోలు జమలయ్య, కోట బెనార్జీ, రామారావు, శరత్, ఏసురత్నం, సువర్ణరాజు, యోహాను, సుందరం, ప్రేమ్ కుమార్, చాట్ల వీరస్వామి, షైక్ బాబురావు పాల్గొన్నారు.

ద్వారకా తిరుమలకు కూరగాయలు

విస్సన్నపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విస్సన్నపేట నుంచి దాతల సహకారంతో మూడు టన్నుల కూరగాయలు ద్వారకా తిరుమల దేవస్థానానికి అందించారు. శుక్రవారం కాకతీయ కమ్మ కల్యాణ మండపం నుంచి కూరగాయలను లారీలో తరలించారు. కార్యక్రమంలో మారేమండ సర్పంచ్ నందమూరి శ్రీరామచంద్ర, సిటీ కేబుల్ చక్రవర్తి, తిరుపతిరావు భక్తులు పాల్గొన్నారు.



దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు

బెల్ట్ నిర్వహిస్తే కఠిన చర్యలు

● ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు

మైలవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మైలవరం ఎక్సైజ్ పరిధిలో శుక్రవారం ఎక్సైజ్ సీఐ జె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. రెడ్డిగూడెం, జి.మండలాల్లో మురళీకృష్ణ, కంచర్ల రామకృష్ణ అనే వ్యక్తుల నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కల్తీ మద్యం విక్రయాలు జగుతునందున బెల్ట్ దుకాణాల్లో మద్యంతాగి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సీఐ సూచించారు.

● వైన్ షాపుల యజమానులు, షాపుల్లో పనిచేసే సిబ్బందికి శుక్రవారం ఎక్సైజ్ స్టేషన్లో సీఐ శ్రీనివాసరావు సమావేశం నిర్వహించారు. బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెల్ట్ దుకాణాలను ప్రోత్సాహించొద్దని, ఎక్సైజ్ శాఖకు సహకరించాలని కోరారు.

మూలపాడు టీడీపీ అధ్యక్షుడిగా మూరకొండ

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మూలపాడు గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా మూరకొండ నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్ఠతకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈమేరకు పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ కొలువు సాధించిన ఉపాధ్యాయులకు సత్కారం

గంపలగూడెం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో నూతనంగా ఉపాధ్యాయులు కొలువులు పొందిన 22 మందిని పీఆర్టీయూశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కారించారు. కార్యక్రమంలో ఎ.సుధాకర్‌రెడ్డి, శరత్, కిరణ్‌కుమార్, కాంతారావు, జయశీలరావు, శ్రీనివాసరెడ్డి, రమేష్, ముత్తరెడ్డి పాల్గొన్నారు.

ఆడపిల్లల పుట్టుకపై తల్లిదండ్రుల ఆలోచన మారాలి

మైలవరం రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆడపిల్లల పుట్టుకపై తల్లిదండ్రుల ఆలోచన మారాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జాతీయ బాలిక వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాటాడుతూ ఆడపిల్లలకు ఉన్న ఇబ్బందులను, ఆకాంక్షలను నిర్మూలించి, వారిపై ప్రత్యేక దృష్టి సారించే దిశగా భారత ప్రభుత్వం నేషనల్ గర్ల్స్ డెవలప్‌మెంట్ మిషన్ ఏర్పాటు చేసిందన్నారు. సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుల మొదలైన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గొల్లపూడి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11కేవీ రిలయన్స్ స్మార్ట్ ఫీడర్ లైన్లు మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్య నిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్ర బాబు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. గద్దె రామ్మోహన్‌రావు వీధి, ఉమ్మయ్య గారి బజార్, కట్ట బజార్, ఆశా హాస్పటల్ రోడ్డు, మైలురాయి సెంటర్, భీమయ్య గారి రైస్‌మిల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

డివిజన్‌స్థాయి ఆటల పోటీలు ప్రారంభం

విస్సన్నపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నర్సాపురం జిల్లాపరిషత్ హైస్కూల్లో డివిజన్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ సెలక్షన్స్ శుక్రవారం ప్రారంభమయ్యాయి. అండర్-14, 17 బాలురు, బాలికలు సెలక్షన్స్ జరిగాయి. విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని సర్పంచ్ నాగమణి తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం శోభలత, ఎంపీడీవో చిన్న రత్నాలు, సుబ్రహ్మణ్యేశ్వరరావు, రమేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

టీడీపీకి వెంకటేశ్వరరావు సేవలు కొనసాగించాలి

● ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

విస్సన్నపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు సేవలు తెలుగుదేశం పార్టీకి కొనసాగించాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం వెంకటేశ్వరరావు నివాసానికి వచ్చి ఆయనతోపాటు కార్యకర్తలతో మాట్లాడారు. పెద్ద కుటుంబంలో చిన్న చిన్న సంఘటనలు జరిగినప్పుడు చర్చించుకొని సమస్యలు పరిష్కరించుకొని ముందుకు సాగుతామన్నారు. సీఎం చంద్రబాబు స్ఫూర్తితో కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలన్నారు. సర్పంచ్ వెంకటేశ్వరరావు పంచాయతీలో సమస్యలు పట్టించుకోవడం లేదని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా, సర్పంచ్‌తో మాట్లాడారు. సమస్యలు పరిష్కరించి ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



వెంకటేశ్వరరావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

దాములూరు పీఏసీఎస్ చైర్మన్‌గా నల్లూరి అప్పారావు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దాములూరి పీఏసీఎస్ చైర్మన్‌గా నల్లూరి అప్పారావు నియమితులయ్యాయి. కమిటీ సభ్యులుగా బొడ్డు చిన్నమ్మాయి, షేక్ ముస్తాఫాలను నియమితులయ్యారు. ఈమేరకు కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి : జేసీ

తిరువూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు సమయంలో రైతులు ఎటువంటి ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఇలాక్కియా ఆదేశించారు. మునుకుళ్ల గ్రామంలో ఆర్ఎస్‌కేలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. రైతులకు అవసరమైన సంచులు, తేమశాతం పరిశీలించే యంత్రం, టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఇతర సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం భూముల రీసర్వేను పరిశీలించారు. పట్టణంలోని, జడ్పీ ఉన్నత పాఠశాలలో జీఎస్టీపై జరిగిన సదస్సులో పాల్గొని పలు అంశాలు వివరించారు. . కార్యక్రమంలో ఆర్డీవో కె.మాధురి, డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రం ప్రారంభించిన జేసీ ఇలాక్కియా

● **ఎ.కొండూరు :** ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాడానికి కోడూరు, పోలిశెట్టిపాడు కొనుగోలు కేంద్రాలు పీఏసీఎస్ చైర్మన్‌లు కృష్ణారావు, శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. రైతులు పండించి పంటను ప్రభుత్వం అందజేసే కనీస మద్ధతు ధరకు విక్రయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చంద్రం, శ్రీనివాసరావు, వీఆర్‌వో మధుబాబు పాల్గొన్నారు.

● **మైలవరం రూరల్ :** చంద్రగూడెం రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ అధ్యక్షుడు మోర్ల రోశాలు శుక్రవారం ప్రారంభించారు. మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో అమ్ముకొని లాభం పొందాలని రైతులకు సూచించారు. దళారులకు తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోవద్దని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు తిరుపతిరావు, తోక నాగరాజు, సీనియర్ ఇన్‌స్పెక్టర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల నమూనాలపై పోటీలు

మైలవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రోటోజోన్ 2కె25 కార్యక్రమం విజయవంతమైందని కళాశాల ప్రిన్సిపాల్ కె.అప్పారావు శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాల నుంచి 81 బృందాలు పాల్గొని తమ సృజనాత్మకత, సాంకేతిక ప్రతిభను ప్రదర్శించాయి. ముగింపు కార్యక్రమంలో ఉత్తమమైన ప్రాజెక్ట్ ప్రదర్శనలు చేసిన విద్యార్థులకు, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు.

సీఎంకు కొలికపూడి కృతజ్ఞతలు

తిరువూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కుమ్మరికుంట్ల వంతెనకు నిధులు మంజూరు చేసినందుకు సీఎం చంద్రబాబును అమరావతి సచివాలయంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలుసుకొని కృతజ్ఞతలు తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ

ఎ.కొండూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు వలన ప్రతి కుటుంబంలో డబ్బు ఆదా అవుతుందని ఎంపీడీవో బొజ్జగాని శ్రీనివాసరావు తెలిపారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై కంభంపాడు జడ్పీ స్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.





నటుడు సుమన్ జగ్గయ్యపేటకు రాక 26న

జగ్గయ్యపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 26న సినీ హీరో సుమన్ ఆధ్వర్యంలో నడుస్తున్న జెన్ షిటోర్యు కరాటే-దో అసోసియేషన్ తపోవన్ విద్యాలయంలో నిర్వహిస్తున్న గ్రాండ్ బెల్ట్ గ్రేడింగ్ ఎగ్జామ్స్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఎమ్మెల్యే శ్రీరాం తాత య్యను తపోవన్ విద్యాలయం డైరెక్టర్ మందడపు రాధాకృష్ణ, ప్రిన్సిపాల్ మందడపు సుధీర్, గుత్తా సురేష్‌లు ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు సర్టిఫికెట్లు, మెడల్స్ పంపిణీకి సినీ నటుడు సుమన్ వస్తున్నారని వారు తాతయ్యకు వివరిం చారు. ఎగ్జామ్స్‌లో ఉత్తీర్ణులైన వారికి 26న సామూహికంగా సర్టిఫికెట్లు అందజేస్తామని, విద్యార్థుల కరాటే ప్రదర్శన ఉంటుందని వివరించారు.



వినికిడి పరికరాన్ని బాలికకు అందజేస్తున్న తాతయ్య, దాత పేరూరి నరసింహారావు

దివ్యాంగ బాలికకు వినికిడి పరికరం వితరణ

జగ్గయ్యపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో భవిత సెంటర్‌లో చదువుతున్న కొత్తపల్లి మోక్షితప్రియ అనే దివ్యాంగ బాలికకు పట్టణ ప్రముఖులు, జిల్లా వాసవీ సేవా సమితి గౌరవాధ్యక్షులు, బియ్యం, కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు పేరూరి నరసింహారావు తండ్రి గురునాథం సంస్మరణార్థం రూ.22వేలు విలువ చేసే వినికిడి యంత్రాన్ని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య చేతుల మీదగా అందజేశారు. వినికిడి యంత్రాన్ని సబ్సిడీ ధరపై తీసుకుని వచ్చిన నియోజకవర్గ దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, దాతను తాతయ్య అభినం దించారు. భవిత సెంటర్ ఉపాధ్యాయురాలు ఉదయలక్ష్మీ, యన్నాకుల రాంబాబు, మహంకాళి జయప్రకాష్, కంభంపాటి రవి, ధారా కిశోర్‌లు పాల్గొన్నారు.

'మిక్'లో రక్తదాన శిబిరం

కంచికచర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మిక్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ విభాగం, విజయవాడ ఆంధ్ర ఆసుపత్రి సంయుక్త సహకారంతో రక్త దాన శిబిరాన్ని నిర్వహిం చారు. 80 మంది విద్యార్థులు స్వచ్ఛం దంగా రక్తదానం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో మిక్ విద్యార్థులు ఎంతో మందికి రక్తదానం చేసి ప్రాణాలు నిలిపారని, ఎలాంటి స్వార్థం లేకుండా సామాజిక బాధ్యతను ప్రతిబింబించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వంశీకిరణ్ పేర్కొన్నారు. రక్తదానం చేసిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీఈవో డి.పాండురంగారావు, మేనేజ్‌మెంట్ మెంబరు ఎం.సుహాస్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.సునీల్, శివారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.రాజేష్ పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అచ్యుతరావు

ప్రమాదాలకు నెలవు మూలమలుపు

- మలుపు వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేవు
- రోడ్డును మూసేసిన కంపచెట్లు
- మూలమలుపు వద్ద విద్యుత్ సౌకర్యం ఏర్పాటుచేయాలి
- ప్రమాదాలను ఆహ్వానిస్తున్న మలుపు

(పెనుగంచిప్రోలు ఆంధ్రజ్యోతి)

పెనుగంచిప్రోలు చెరువు మూలమలుపు వద్ద హెచ్చరిక బోర్డు లేకపోవడం వలన తరుచూ ప్రమాదాలు జురుగుతున్నాయి. పెనుగంచిప్రోలు నుంచి ముండ్లపాడు వెళ్ళే రహదారిలోని చెరువు అలుగు మలుపు వద్ద ఎలాంటి సూచిక హెచ్చరిక బోర్డులను ఆర్అండ్‌బీ వారు ఏర్పాటు చేయలేదు. ఈ మలుపు వద్ద కంప చెట్లు రోడ్డుపైకి వచ్చి ఉన్నాయి. దీంతో అలుగు బ్రిడ్జి వద్దకు వచ్చేవరకు రహదారి కనపడకపోవడంతో ద్విచక్ర వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురివుతున్నారు. అంతేకాకుండా ఈ అలుగు వద్ద విద్యుత్ సౌకర్యం లేకపోవడం, పలు దిమ్మెలకు రేడియం స్టిక్కర్లు లేక పోవడంతో రాత్రి పూట ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. కావున ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి అలుగు సమీపంలో రోడ్డుకు ఇబ్బందిగా ఉన్న కంపచెట్లను తొలగించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేసి దిమ్మెలకు రేడియం స్టిక్కర్లను అంటించాలని ప్రయాణికులు కోరుతున్నారు. అదే విధంగా గ్రామ పంచాయతీ వారు ఈ అలుగు సమీపంలో విద్యుత్ సౌకర్యాన్ని ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు.



పెనుగంచిప్రోలు చెరువు అలుగు మూల మలుపు ఇదే..

కోహన్స్ జాబ్‌మేళాకు 70 మంది హాజరు

జగ్గయ్యపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జేఆర్సీ ఆధ్వర్యంలోని విశ్వ భారతి డిగ్రీ కళాశాలలో ముక్త్యాల కోహన్స్ లైఫ్‌సైన్సెస్ జాబ్‌మేళాను నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ సభ్యుడు శ్రీరాం చినబాబు, జేఆర్సీ విద్యాసంస్థల చైర్మన్ రంగాపురం నరసింహారావు, సెక్రటరీ పెనుగొండ రాజీవ్‌లతో కలిసి ప్రారంభించారు. 70 మంది బీఎస్సీ కెమిస్ట్రీ చదివిన అభ్యర్థులు హాజరు కాగా సీనియర్ హెచ్ఆర్ మేనేజర్ సాయిరాం, హెచ్ఆర్ రాములు ఇంటర్వ్యూలు చేశారు. త్వరలోనే ఎంపికైన అభ్యర్థులకు కాల్ లెటర్స్ పంపుతామని కోహన్స్ హెచ్ఆర్ తెలిపారు. కార్యక్రమంలో జేఆర్సీ ప్రిన్సిపాల్స్ జె.వెంకటేశ్వర్లు, కె.ఎస్.రమేష్, జె.తిరుపతిరావు, వి.వి.ఎల్ నారాయణరావులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతులకు ప్రజాప్రతినిధుల డుమ్మా

జగ్గయ్యపేట రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలలో సుస్థిర అభివృద్ధి సాధించే లక్ష్యంతో శుక్రవారం చిల్లకల్లు ఎంపీడీవో కార్యా లయంలో నియోజక వర్గ స్థాయిలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణా కార్యక్రమానికి సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఎంపీపీలు ఆశించిన స్థాయిలో హాజరు కాలేదు. వత్సవాయి మండలం 25, పెనుగంచిప్రోలు 15, జగ్గయ్యపేట మండలం 16 మందితో మొత్తం 56 మంది ఉండగా కేవలం 19 మంది మాత్రమే హాజరయ్యారు. పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల ఎంపీపీలు కూడా గైర్హాజరయ్యారు. మొదటి రోజు శిక్షణలో రానున్న ఏడాదిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై యాక్షన్ ప్లాన్ తయారీ, స్థానిక వనరులతో సుస్థిర అభివృద్ధిపై మాస్టర్ ట్రైనర్స్ అరుణ్, ఆంజనేయులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరగాల్సిన శిక్షణా కార్యక్రమం ప్రజా ప్రతి నిధులతో పాటు కార్యదర్శులు కూడా మధ్యాహ్నభోజనం తరువాత డుమ్మా కొట్టడం కొసమెరుపు. ఎంపీడీవో నితిన్, ఈవోపీఆర్డీ ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాప్రతినిధులు లేకుండానే జరుగుతున్న శిక్షణా కార్యక్రమం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగ్గయ్యపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం ఇండోర్ సబ్ స్టేషన్, తొర్రగుంటపాలెం సబ్‌స్టేషన్, బలుసుపాడు సబ్ స్టేషన్ పరిధిలో జగ్గయ్యపేట పట్టణం, కే.అగ్రహారం, ముక్త్యాల, త్రిపురవరం, బూదవాడ ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల నిర్వహణకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ ప్రమీల చెప్పారు.

సత్యమ్మ ఆలయ నూతన పాలకవర్గ సభ్యుల అభినందన సభ నేడు

నందిగామ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబారుపేట గ్రామంలోని సత్యమ్మ అమ్మవారి ఆలయ నూతన పాలకవర్గ సభ్యుల అభినంధన కార్యక్రమం శనివారం జరుగుతుందని చైర్మన్ మంచాల మాధవరావు శుక్రవారం తెలిపారు. ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు చైర్మన్‌తో పాటు సభ్యులు తొండపు పుణ్యావతి, కంసాని రమాదేవి, దర్శి పుష్పావతి, మోదల నాగమణి, కొత్తమాసు రాజేశ్వరరావు, బెల్లంకొండ కాంతారావు, సూర్యవరపు శ్రీనివాసరావు, ఐలపోగు రాంబాబు, ఎర్రబండి మణిలకు అభినందన కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

ఈవ్‌టీజర్ల అరెస్టు

జగ్గయ్యపేట రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై విజయవాడ వైపు వెళ్తున్న ఆటోలో కూర్చున్న మహిళల పట్ల బైకుపై అదే మార్గంలో వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు ఈవ్‌టీజింగ్‌కు పాల్పడు తున్నారని మహిళలు హైవే పోలీసులకు ఫిర్యాదు చేయటంతో నందిగామకు చెందిన వెంకటేశ్వర్లు, ఇందుగపల్లికి చెందిన సుధాకర్‌లను చిల్లకల్లు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఉపాధ్యాయులకు అవార్డులు

వత్సవాయి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): డీపీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని బెస్ట్ ఎనోరోల్‌మెంట్ అవార్డులను నాలుగు పాఠశాలలు ఎంపీపీ పాఠశాల మక్కపేట, ఎంపీపీ పాఠశాల భీమవరం, ఎంపీపీఎస్ వత్సవాయి మెయిన్, ఎంపీపీఎస్ పోలంపల్లి పాఠశాలల ఉపాధ్యాయులకు రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను శుక్రవారం అవార్డులు అందించారు. మరి కొంత మంది ఉపాధ్యాయులను సత్కరించారు. ఈకార్యక్రమంలో ఎంఈవో ఎల్.నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి వై.మల్లేశ్వరరావు, అర్బన్ కార్యదర్శి శ్రీనివాసరావు, నాగరాజు, సుందరరావు, రవీంద్రనాథ్, కిరణ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా చేగు విద్యాలయం ఫౌండర్స్‌డే

జగ్గయ్యపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో చేగు విద్యాలయం ఫౌండర్స్‌డేను శుక్రవారం స్కూల్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. చీఫ్ ఫౌండర్ చేగు వెంకటకృష్ణారావు, పెనుగొండ బదరీనారాయణలు జయంతి సందర్భంగా కేక్ కట్ చేశారు. విద్యాలయం స్థాపించి కార్పొరేట్ విద్యను సామాన్య ప్రజలకు అందించారని వారి ముందుచూపును ప్రశంసించారు. స్కూల్ సెక్రటరీ కొత్తమాసు మల్లిఖార్జునరావు, ప్రెసిడెంట్ తాడేపల్లి సోమేశ్వరరావు, ప్రిన్సిపాల్ రాయపుడి నరసింహారావు, పెనుగొండ రాజీవ్‌లు పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఫౌండర్స్ ఆశయాలకు అనుగుణంగా భవిష్యత్‌లోను బోధన జరుగుతుందని ప్రకటించారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్రస్థాయి శ్రేష్ట విద్యాసేవ పురస్కారం అందుకున్న కొత్తమాసు మల్లిఖార్జునరావును సత్కరించారు.

పెద్దవరం, పెద్దాపురం, వత్సవాయి పీఏసీఎస్ చైర్మన్లుగా

హనుమంతరావు, రాజేంద్ర, రామయ్య

నందిగామ రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవరం గ్రామంలోని సొసైటీకి త్రిమెన్ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. చైర్మన్‌గా జమ్మలమూడి హనుమంతరావు, సభ్యులుగా మిరియాల గోపయ్య, గద్దం నాగమ్మలను నియమించటంపై గ్రామస్తులు, టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● **మైలవరం :** వీరులపాడు మండలం పెద్దాపురం గ్రామం పీఏసీఎస్ అధ్యక్షుడుగా నిమ్మల రాజేంద్రను నియమించారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, కంచికచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ కోగంటి బాబు, వీరులపాడు మండల పార్టీ అధ్యక్షుడు కొండ్రగుంట శ్రీనివాస్ కుమార్‌లకు రాజేంద్ర కృతజ్ఞతలు తెలియజేశారు.



జమ్మలమూడి హనుమంతరావు



నిమ్మల రాజేంద్ర

● **వత్సవాయి :** వత్సవాయి మండలం చిట్యేల పీఏసీఎస్ చైర్మన్‌గా శింగవరం గ్రామానికి చెందిన దొప్పలపూడి రామయ్యను, సూరె వెంకయ్య (సింగవరం), పిల్లెం వెంకయ్య (చిట్యేల) పర్సన్‌గా ప్రభుత్వం నియమించింది. మండలంలోని 12 పీఏసీఎస్‌లకు గాను 10 సొసైటీలకు ఆగస్టులో చైర్ పర్సన్ నియామకం జరిగింది. చిట్యేల సొసైటీలకు చైర్ పర్సన్‌గా శుక్రవారం నియమించారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

జగ్గయ్యపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నందిగామ బార్ అసోసియేషన్ సభ్యుడు బండి మల్లికార్జునరావుపై కంచికచర్ల పోలీసులు అక్రమ కేసు పెట్టి వేధిస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం జగ్గయ్యపేటలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు, గోనెల వెంకటేశ్వర్లు, సత్యశ్రీనివాస్, దాసరి నాగేశ్వరరావు, శేషకుమారి, జ్యోతి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న జగ్గయ్యపేట న్యాయవాదులు

పత్తికి కనీస మద్దతు ధర అందించాలి

నందిగామ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పత్తికి కనీస మద్దతు ధర 10,050 రూపాయలు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పి.వి ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యాల వల్ల పత్తి దిగుబడి తగ్గిందన్నారు. పెట్టుబడులు భారీగా పెరిగిన నేపథ్యంలో పత్తికి మద్దతు ధర పెంచడంతో పాటు సీసీఐ కేంద్రాలను తక్షణమే ఓపెన్ చేసి కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కొనుగోళ్లలో ఎటు వంటి నిబంధనలు పెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి కటారపు గోపాల్, గుమ్మళ్ల ఏడుకొండలు, రాయిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి లక్ష్యం : మాజీ మంత్రి వసంత

నందిగామ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని ఐతవరం గ్రామ సొసైటీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మద్దుకూరి రామారావు, కార్యదర్శి రాధాకృష్ణ, నాయకులు వీరాస్వామి, అంకురావు, తదితరులు పాల్గొన్నారు.

● **చందర్లపాడు** : రైతులు పండించిన పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చందర్లపాడు సహకార సంఘం అధ్యక్షుడు కట్టా అప్పారావు తెలిపారు. శుక్రవారం స్థానిక సహకార సంఘ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కట్టా మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర అందిస్తూ పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేయ నున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చి రైతులు లబ్ధి పొందాలన్నారు. ఈకార్యక్రమంలో సంఘ కార్యదర్శి తిప్పిరెడ్డి వేణుమాధవరెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందుల వాడకంపై అవగాహన

వత్సవాయి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రసాయన పురుగు మందులు తగ్గించి జీవ శిలీంద్ర నాశిని జీవ పురుగు మందులు వాడాలని సేద్యవిభాగపు శాస్త్రవేత్త ఎన్.రాజశేఖర్ తెలిపారు. కన్నెవీడులో శుక్రవారం జీవన ఎరువులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం గరికపాడు ప్రోగ్రాం కో.ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.రవి కిషోర్ రైతులకు ఎరువులు, పురుగు మందుల వాడకంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు ఆశయాన్నిస్ఫూర్తిగా తీసుకోవాలి

జగ్గయ్యపేట రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని విజన్ 2047 నాటికి అగ్రగామిగా ఉంచాలన్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయాన్ని స్ఫూర్తిగా తీసుకుని అన్ని శాఖల అధికారులు ప్రగతి సాధించాలని ఆర్డీవో బాలకృష్ణ సూచించారు. శుక్రవారం చిల్లకల్లులోని విద్యాశాఖ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన విదేశాలలో ఉన్నవారిని గుర్తించి బంగారు కుటుంబాలకు ఆసరా అందించేలా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రత్యేకాధికారి బాలాజీ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.